ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 03.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 284 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటన రీషెడ్యూల్ 8



> మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమని సీఎం రేవంత్ రెడ్డి న్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. మొన్న వర్షా లు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని, రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు.

మూసీలో మురికి బీఆర్ఎస్ నేతల కడుపులో విషం

మూసీ మురికి తీస్తామంటే బీఆర్ఎస్ నేతలకు ఎందుకు కడుపుమంట?

- రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ
- మూసీలో ఏడాదంతా నీళ్లు ప్రవహించడానికి ప్రణాళికలు
- మార్చి 31 లోగా టెండర్లు పూర్తి చేస్తాం
- గండిపేట– గౌరెల్లి వరకు 55 కిమీ. ఎలివేటెడ్‌కారిడార్
- రూ.450 కోట్లతో మీరాలం ట్యాంకు అభివృద్ధి పనులు
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: మూసీలో మురికి ఉంది. ఈ మురికికన్న ప్రమాదంగా బీఆర్ఎస్ నేతల కడుపులో విషం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమ న్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు

...:: మిగతా 2లో

మూసీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సీఎం మాటలు మూసీ కంటే కంపుగా ఉన్నాయి

- ఏడడిగినా డబ్బులు లేవంటారు
- మూసీ సుందరీకరణకు లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తారు?
- మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం లక్షల కోట్ల ప్రజాధనం ఖర్చు చేయబో తున్న నేపథ్యంలో, మొత్తం వ్యయం, నిధుల వనరులు, నిర్వాసితులకు ఇచ్చే పరిహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ క్వశ్చన్ అవర్ సందర్భంగా, అలాగే పాయింట్ ఆఫ్ ఆర్డర్‌పై మాట్లాడిన ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మూసీ సుందరీకరణకు ఎంత ఖర్చవుతుందో ఇప్పటికీ ప్రభుత్వానికి స్పష్టత లేదని హరీష్ రావు అన్నారు. ఒకసారి ముఖ్యమంత్రి లక్ష కోట్లు అంటారని, మరోసారి లక్షా 50 వేల కోట్లు అంటారని పేర్కొంటూ, అసలు అంచనా ఎంతనేది ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వమంటే డబ్బులు లేవని, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వమంటే నిధులు లేవని ప్రభుత్వం చెబుతుందని, అలాంటప్పుడు మూసీ సుందరీకరణకు లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు కూల్చారని, కూల్చిన ఇళ్లకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. నిర్వాసితులకు వేజ్ లాస్ చెల్లించారా? లేక గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వేసి చేతులు దులుపుకున్నారా? అని నిలదీశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఒక్కో కుటుంబానికి సుమారు రూ.14.5 లక్షల పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని, పాత ఇళ్లకు ఆర్అండ్‌బీ ఎస్టిమేట్ చేసి నగదు చెల్లించడంతో పాటు,

...:: మిగతా 2లో



దేశంలో పెరుగుతున్న వైట్ కాలర్ ఉగ్రవాదం

దేశంలో 'వైట్ కాలర్' ఉగ్రవాదం పెరుగుతున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అత్యంత విద్యావంతులైన కొందరు సమాజానికి, దేశానికి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

7



ఇండోర్‌లో నీరు కాదు.. విషాన్ని పంపిణీ చేశారు

మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ లో కలుషిత నీరు తాగి పలువురు మృతి చెందడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి పరిపాలన కుంభకర్ణుడిలా నిద్రపోతోందని మండిపడ్డారు.

7



బృహత్ నగరానికి మౌలిక సదుపాయాలు

- ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- చిక్కడపల్లి– దోమలగూడ లింక్ బ్రిడ్జి ప్రారంభం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: హైదరాబాద్ బృహత్ నగరంగా ఆవిర్భవించిన నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ నిధులు రూ.6 కోట్లతో హుస్సేన్ సాగర్ సర్‌ప్లస్ నాలాపై నూతనంగా నిర్మించిన చిక్కడపల్లి -దోమలగూడ లింక్ బ్రిడ్జిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్,

...:: మిగతా 2లో

కూలీలను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్ర

- మహాత్మాగాంధీ ఉపాధి చట్టం నిశ్శబ్ద విప్లవం
- గాంధీల కుటుంబం దేశం కోసం రక్తం చిందించింది
- బీజేపీలోని ఏ ఒక్కనాయకుడైనా దేశం కోసం త్యాగం చేశారా?
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా ఊతమిచ్చిందని శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలను, మధ్య తరగతి ప్రజలను కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేసేలా కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని తీవ్రస్థాయిలో ఆయన విమర్శించారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ఈ పథకం ఆనాడు యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చారని ఆయన చెప్పారు. స్వాతంత్రం అనంతరం ఆరు నెలల్లో హత్య చేశారన్నారు. ఆయన రక్తం దేశం భూమి పొరల్లో కలిసి పోయిందని చెప్పారు. సోనియా గాంధీ గారు దేశ సమగ్రత కోసం కృషి చేశారని పేర్కొనన్నారు. రాజీవ్ గాంధీ కూడా

...:: మిగతా 2లో





అలా అయితే భార్యను వేధించినట్టు కాదు

లెక్కలు అడుగుతున్న భర్తపై కేసుపెట్టాలంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

7




మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

- డీజీపీ ఎదుట లొంగిపోయిన బర్సే దేవా
- మరో 15 మంది మావోయిస్టులతో కలిసి సరెండర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, ఉత్తర తెలంగాణ, జనవరి 2: మావోయిస్టు అగ్రనేత బర్సే దేవా తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. మరో 15 మంది మావోయిస్టులతో కలిసి ఆయన సరెండర్ అయ్యారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా బర్సే బాధ్యతలు నిర్వర్తించారు. మరో అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీలో దేవా కీలకంగా ఉన్నారు. మావోయిస్టు పార్టీ సాయుధ బలగాల వ్యవహారాలను ఆయన చూశారు. కాగా హిడ్మా, బర్సే దేవా ఛత్తీస్‌గఢ్‌లోని ఒకే గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మావోయిస్టులకు ఆయుధాల సరఫరాలో దేవా కీలకపాత్ర పోషించారు. గురువారం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు నుంచి బర్సే దేవా బృందాన్ని పోలీసులు తీసుకొచ్చారు. బర్సే లొంగుబాటు వివరాలను డీజీపీ శివధర్ రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద అవినీతి కుట్ర

- మూసీ 'బ్యూటిఫికేషన్' పేరుతో భారీ ఆర్థిక దోపిడీ
- రెడ్ కార్నర్ నోటీసులున్న సంస్థకు మూసీ ప్రాజెక్టా?
- సీఎం రేవంత్‌ప్రతీ నరంలో విషమే ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: మూసీ నది పునరుజ్జీవన పేరుతో అసెంబ్లీలో అబద్ధాలు ప్రచారం చేస్తూ, తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద అవినీతి కుట్రకు తెరలేపారని, మూసీ శుద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌కి ఏ మాత్రం దూరదృష్టి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌విమర్శించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్‌తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన అక్రమ సంపదపై ప్రశ్నలు అడిగేవారిపట్ల, మూసీ ప్రాజెక్టును ప్రస్తుత రూపంలో వ్యతిరేకిస్తున్న వారిపట్ల ఉన్నకక్షతోనే రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, ఆయన ప్రతి నరంలో విషం ప్రవహిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఉపయోగించిన భాష మూసీ కాలుష్యానికంటే దుర్వాసనగా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డీపీఆర్ తయారవడానికి ఇంకా కనీసం ఏడాది పడుతుందని ప్రభుత్వమే ఒప్పుకుంటున్నప్పటికీ, ₹1.5 లక్షల కోట్ల వ్యయం ఎలా ప్రకటించారని కేటీఆర్ ప్రశ్నించారు. "డీపీఆర్ లేకుండా ఇంత భారీ అంచనాలు ఎలా ప్రకటించారు?" అని నిలదీశారు. చట్టబద్ధమైన ప్రణాళికలు, అనుమతులు కూడా లేకుండానే పేదల ఇళ్లను కూల్చడానికి బుల్డోజర్లు ఎందుకు దించారని ప్రశ్నించారు. మూసీ 'బ్యూటిఫికేషన్' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఆర్థిక దోపిడీకి సిద్ధమవుతోందని కేటీఆర్ ఆరోపించారు. కీలక పనులను బ్లాక్‌లిస్ట్ అయ్యి, రెడ్ కార్నర్ నోటీసులు ఎదుర్కొంటున్న మెయిన్‌హార్డ్ అనే సంస్థకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. "ఇలాంటి చరిత్ర ఉన్న కంపెనీకి ఇంత పెద్ద ప్రాజెక్టును ఎలా అప్పగిస్తారు?" అని ప్రశ్నిస్తూ, ఇది పక్కా అవినీతి కుట్రేనని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షకు పైగా కుటుంబాల ఇళ్లను కూల్చి వారిని నిరాశ్రయులను చేయాలని ముఖ్యమంత్రి బహిరంగంగానే ప్రకటించారని కేటీఆర్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయట పెడుతోందన్నారు. "కాంగ్రెస్ పాలన అంటే నిర్మాణం కాదు, కూల్చివేతలు," అని వ్యాఖ్యానించారు. హిమాయత్ సాగర్,

...:: మిగతా 2లో

కేసీఆర్‌ను టెర్రరిస్ట్‌తో పోల్చితే దేశద్రోహమే

- ఉద్యమ నాయకుడిపై ఉగ్రవాద ముద్రా?
- సీఎం వ్యాఖ్యలకు కవిత ఆగ్రహం
- పాలమూరు పేరుతో రాజకీయాలు.. నీళ్లు మాత్రం శూన్యం
- కేసీఆర్ ఉద్యమ ఫలితంగానే తెలంగాణ
- బబుల్ షూటర్లకు పెత్తనం ఇచ్చి సమాధానం చెప్పిస్తే ప్రజలకు అర్థం కాదు
- కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే బీఆర్ఎస్ ను దేవుడు కూడా కాపాడలేడు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

...:: మిగతా 2లో





అంగారక గ్రహంపై నీటి గుహలు

అంగారక గ్రహంపై నీటి గుహలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. హెబ్రుస్ వాలీస్ ప్రాంతంలో ఆ గుహలు ఉన్నట్లు తేల్చారు. నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా వేస్తున్నారు.

7

రాజకీయం

నెలాఖరులోగా 'మున్సిపల్' నోటిఫికేషన్

- మంత్రి అడ్లూరి కీలక వ్యాఖ్యలో



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: మున్సిపల్ ఎన్నికలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెలాఖరు కల్లా మున్సిపాలిటీల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ నేతల వ్యవహార శైలి చూస్తున్నామని, వారి పంతం నెగ్గించుకోవడానికి ఏమైనా చేస్తారని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే ముఖం బీఆర్ఎస్ నేతలకు లేదని ఎద్దేవా చేశారు. తమ తప్పు ఉంటే అసెంబ్లీలో నిరూపించాలని సవాల్ విసిరారు. మూసీ అంశంలో బీఆర్ఎస్ నేతలే రన్నింగ్ కామెంటరీ చేశారని ప్రస్తావించారు. నరేగా పథకంపై, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేక బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థులకు వేడి నీటిని అందించడానికి సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఇందుకోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో కనీసం గౌరవం ఇవ్వలేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారు

- ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్ జనవరి 2: ;మూసీ ప్రక్షాళనతో నిరుపేదల బతుకులు చితికిపోవద్దని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారని ప్రశ్నించారు. వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ ప్రక్షాళనపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచి చేస్తారా? మధ్యలో నుంచి చేస్తారా అని ప్రశ్నించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు. మూసీ - ఈసా నదులు కావు.. అవి ఇప్పుడు సీవరేజ్ ప్లాంట్లు అని అక్బరుద్దీన్ విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలు పెట్టిన పెడస్ట్రేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

కూలీలను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి

దేశం కోసం ప్రాణాలిచ్చారన్నారు. మీరెవరైనా దేశం కోసం ఒక్క రక్తపు బొట్టు అయినా కార్చారా? అంటూ బీజేపీని ఆయన ప్రశ్నించారు. ఈ చర్చలో బీఆర్ఎస్ పాల్గొనకపోవడం దురదృష్టకరం అని చెప్పారు. వాళ్లకు పేదల మీద ప్రేమ లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజకీ లబ్ధి తప్ప ప్రజల మీద ఆలోచన లేదని విమర్శించారు. బీజేపీ తీసుకువచ్చిన చట్టానకి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం బీఆర్ఎస్ కు లేదన్నారు. అంతేకాక వారికి మద్దతుగా ఉండే ఆలోచన మాత్రమే ఉంది. ఇది రాష్ట్రానికి ఏ మాత్రం మంచిది కాదన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమని, భూమి లేని నిరుపేదలకు భూస్వాముల భూములను పేదవాళ్లు భూమిని పంపిణీ చేసిందన్నారు. ఇది సమాజంలో అసమానతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణలో తీసకువచ్చిన ల్యాండ్ టెన్నెన్సీ యాక్ట్ తీసకువచ్చి భూములపై హక్కులను కల్పించామని చెప్పారు. బ్యాంకలు జాతీయాకరణ ద్వారా దేశంలోని ప్రయివేట్ బ్యాంకులను జాతీయ చేశాము. సామాన్యులను, పేదలను, రైతులను బ్యాంకులకు తీసుకువచ్చి లోన్లు తీసుకోవడం జరిగింది. సమాజంలో ఎన్నో మార్పులకు ఇది ఈ నిర్ణయం నాంది పలికిందన్నారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టం ద్వారా ప్రతి పేద వాడికి ఆహార భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. దేశం నేడు అభివృద్ధి చెందిందంటే.. ఆనాటి నాయకులు ముందు చూపు మాత్రమే. పండిట్ నెహ్రూ, మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్ అంటే బీజేపీ ప్రభుత్వానికి ఏ మాత్రం పడదని మంత్రి అన్నారు. ఒకప్పుడు కూలీ పెరగాలంటే ఉద్యమాలు జరిగేవి. లాఠీ ఛార్జీలు జరిగేవి. అలాంటవి ఊమీ లేకుండా ఉపాధి కూలీ చట్టం ద్వారా ఒక్కటే సారి వంద రూపయాలు పెంచి అన్ని కల్పించేవి. నిశ్శబ్ద విప్లవం ఇది. ఈ చట్టాన్ని మార్చేసి.. సమాజంను ఇబ్బందుల్లోకి నెట్టడమే. కార్పోరేట్ శక్తులకు వంత పాడేలే కొత్త చట్టం ఉందన్నారు. జీవితాలకు భద్రత లేకుండా చేస్తున్నారు. మాది రైట్ టు వర్క్ అనేది మా చట్టం. మీరు దానిని పూర్తిగా మార్చేశారని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు ఏం పాపం చేశాయి. దేశానికి జీడీపీ ఇవ్వడమే మేము చేసిన తప్పా. ఎవరి సొమ్ము ఎవరికి ధారాదత్తం చేస్తున్నారు. పేదలకు మేలు చేసే చట్టాలకు బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని . దీనిని ఖండిస్తున్నాం. కూలీలకు బేరం ఆడే శక్తిని తగ్గిస్తుంది. ఇది అత్యంత ప్రమాదకరం. గ్రామీణ మహిళలకు ఆర్థిక సాధికారత నశించిపోతుంది. సామాజిక పరివర్తనకు ఇది గండి కొడుతుంది. ఉపాధి కూలీలందరూ ఈఆ రోజుఏ మౌనంగా రోధిస్తున్నారు. పేదల పక్షాన నిలబడేందుకు మనం ఒక ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి అని కోరారు.

బృహత్ నగరానికి మౌలిక సదుపాయాలు

మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జోనల్ కమిషనర్ రవికిరణ్, స్థానిక కార్పొరేటర్లు, ఎస్ఈ మోహన్ రెడ్డి, ఈఈ రోహిణి, డీఈఈ రేణుక, ఏఈఈ ప్రశాంత్ పాల్గొన్నారు. బ్రిడ్జి ప్రారంభ అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఓఆర్ఆర్ లోపల , ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న పురపాలికల విలీనంతో విస్తీర్ణం, జనాభా పరంగా గ్రేటర్ హైదరాబాద్ దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించిందని తెలిపారు. ఇంత పెద్ద నగరంలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా రహదారులు, డ్రైన్లు, వీధి దీపాలు, పార్కులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతోందని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన కేంద్రంగా, కోర్ సిటీగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌కు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద అవినీతి కుట్ర

మొదటిపేజీ తరువాయి

ఉస్మాన్ సాగర్ పరిసరాల్లో మంత్రులు అక్రమంగా నిర్మించుకున్న గెస్ట్ హౌసులను మాత్రం వదిలేసి, పేదల ఇళ్లనే కూల్చడం అన్యాయమని అన్నారు. ఏకీకృత రాష్ట్రంలో దాదాపు 60 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్, టీడీపీలే మూసీని మురుగునీటి కాలువగా మార్చాయని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి స్వయంగా ఈ రెండు పార్టీల్లో పనిచేసిన వ్యక్తేనని, వారి వైఫల్యాలకు బాధ్యత తప్పించుకోలేడని అన్నారు. నల్గొండ జిల్లా ప్రజలను కలుషిత నీరు, ఫ్లోరైడ్ సమస్యలతో ఏళ్ల తరబడి బాధపెట్టిన ఘనత కూడా గత ప్రభుత్వాలదేనని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ ద్వారా ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గుర్తు చేశారు. మూసీకి 20 టీఎంసీల గోదావరి నీరు తీసుకొస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై కేటీఆర్ సవాల్ విసిరారు. ఆ నీరు కాళేశ్వరం నుంచే వస్తుందా లేదా స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. "కాళేశ్వరం నుంచే అయితే, తలవంచి నిజం ఒప్పుకోవాలి," అని అన్నారు. ఒకవైపు కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తూ, మరోవైపు అదే ప్రాజెక్టుపై ఆధారపడటం ద్వంద్వ వైఖరేనని విమర్శించారు.

బీఆర్ఎస్ హయాంలో తక్కువ ఖర్చుతో టెండర్లు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూసీ పునరుజ్జీవనానికి తక్కువ ఖర్చుతో గ్లోబల్ టెండర్లు పిలిచామని, తొమ్మిది పేరొందిన సంస్థలు డిజైన్లు సమర్పించాయని కేటీఆర్ గుర్తు చేశారు. సుమారు ₹16,000 కోట్లతో సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధంగా ఉండేదని తెలిపారు. "డిజైన్లు సిద్ధంగా ఉన్నప్పటికీ మళ్లీ ప్రక్రియ మొదలుపెట్టడమంటే కమిషన్ల కోసమే," అని ఆరోపించారు. పనులు మొదలుకాకముందే అంచనాలు ₹50,000 కోట్ల నుంచి ₹75,000 కోట్లు, ఇప్పుడు ₹1.5 లక్షల కోట్లకు పెంచడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మూసీలోకి ప్రవహించే 2,000 ఎంఎల్‌డీ మురుగునీటిని శుద్ధి చేయడానికి 36 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మించామని, 2017లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామని కేటీఆర్ తెలిపారు. నాగోలు-ఉప్పల్ వంటి ప్రాంతాల్లో పేదలను తరిమివేయకుండా అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ నేతల కడుపులో విషం

మొదటిపేజీ తరువాయి



నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని, రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలపై ముఖ్యమంత్రి గంటపాటు మూసీ ప్రక్షాళనపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మూసీ నదిలో నీటి కాలుష్యం వల్ల నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఆరోగ్యం దెబ్బతింటున్నదన్నారు. మూసీ నదిలో మురికి నీరు లేకుండా ఏడాదంతా నీటి ప్రవాహం ఉండేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. మూసీనదిలో ఉన్న మురికిని తీస్తామంటే బీఆర్ఎస్ నేతలకు ఎందుకు కడుపుమంట అంటూ మండిపడ్డారు. పేదలకు మంచి జరగాలనే ఎన్ని విమర్శలు వచ్చిన పట్టించుకోమని, తాము ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ముందుకు వెళ్తామన్నారు. మూసీ నదిలో ఏడాదంతా నీళ్లు ప్రవహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన కన్సల్టెంట్‌కోసం గ్లోబల్‌టెండర్లు పిలిచామని, 3 సంస్థలు జాయింట్‌వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ చేపట్టాయని తెలిపారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు నగరానికి తరలించాలని ప్రణాళిక రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు.

వరద ముంపును నగరాన్ని కాపాడేందుకు..

కాకతీయుల నుంచి నిజాం వరకు నదీ పరివాహకంలోనే ప్రాజెక్టులు చేపట్టారని సీఎం వివరించారు. వరద ముంపు నుంచి నగరాన్ని రక్షించేందుకు 1908లో ఉస్మాన్ సాగర్ చేపట్టారు. 1922 నాటి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులు చేపట్టారు.' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజాంలు నిర్మించిన ప్రాజెక్టులే నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గతంలో జల వనరులను కాపాడుకునే ప్రయత్నాలు జరగలేదన్నారు. కొంతమంది దొరలు మురికి నీటిని జల వనరులను కలుషితం చేసి, కబ్జాలు పెట్టి, ఫాంహౌస్‌లు కట్టారని గుర్తు చేశారు. ఫాంహౌస్ల డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారని వివరించారు. నిందితులపై ఉక్కుపాదం మోపి డ్రైనేజీలను కూలగొట్టి చర్యలు చేపట్టామని సీఎం తెలిపారు. జన్వాడ, మొయినాబాద్లలో ఫాంహౌస్‌ల విషయంలో దాడులు జరిగాయన్నారు.

కోట్లు వెచ్చించి దుష్ప్రచారం...

రూ.కోట్లు ఖర్చు పెట్టి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని, పేదలకు మంచి జరగాలనే ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గలేదని సీఎం స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణపై అధ్యయనం చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. లండన్, జపాన్, జర్మనీ, సింగరూప్, దక్షిణకొరియాలో అధ్యనం చేశామన్నారు. ప్రపంచస్థాయి నగరాల్లో నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకుని వ్యాపార కేంద్రాలుగా మార్చారని తెలియజేశారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆయా దేశాలు పోటీపడుతున్నాయని చెప్పారు. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60 వేలు కుటుంబాలను తరలించిన విషయం గుర్తు చేశారు. యూపీలో గంగా నది ప్రక్షాళన చేసి రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధికి బీజేపీ ఎన్నికల అజెండాగా మార్చారని వివరించారు. ఆయా రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించట్లేదని, నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామన్నారు.

నిజాంలు చేసిన అభివృద్ధి కనుమరుగు..

నదీ పరివాహక ప్రాంతాన్ని వ్యాపార కేంద్రంగా నిజాంలు తీర్చిదిద్దారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. ప్రపంచ దేశాలతో హైదరాబాద్ పోటీపడేలా నిజాంలు తీర్చిదిద్దారన్నారు. ఇప్పుడు నిజాంలు చేసిన అభివృద్ధిని కనుమరుగు చేశారన్నారని ఆరోపించారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని ఆవేదన చెందారు. హైదరాబాద్ లో మురుగు కాలువలను మూసీ నదికి కలిపారని అసహనం వ్యక్తం చేశారు. మూసీ నది కలుషితం వల్ల నల్గొండ జిల్లా ప్రజలు జీవించలేని పరిస్థితి ఎదురైందన్నారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాది మంది విజ్ఞప్తి చేశారని సీఎం పేర్కొన్నారు.

మూడు సంస్థలు ముందుకు...

"3 సంస్థలు జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణను చేపట్టాయని సీఎం వివరించారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు నగరానికి తరలించాలని ప్రణాళికలు చేస్తున్నామన్నారు హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేందుకు 15 టీఎంసీలు తరలించాలని యోచన అని తెలిపారు. మరో 5 టీఎంసీలు గండిపేటకు తరలించాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. రూ.7 వేల కోట్ల వ్యయంతో గోదావరి నదీ జలాలు తరలించి మూసీ, ఈసీ, గోదావరి నదుల సంగమంగా అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో గోదావరి జలాలు గండిపేటకు తరలిస్తామని తెలిపారు.

మార్చిలో టెండర్లు పూర్తి...

మార్చి 31 లోగా టెండర్లు పూర్తి చేసి మొదటి దశ చేపట్టాలని యోచన చేస్తున్నామని సీఎం వివరించారు. గండిపేట, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 21 కి.మీ. మొదటి దశ పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.4,100 కోట్ల ఏడీబీ రుణాలతో మొదటి దశ చేపట్టాలని యోచన చేస్తున్నాంమని సీఎం తెలిపారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. మేర ఎలివేటెడ్‌కారిడార్ నిర్మాణం చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఓఆర్ఆర్ 160 కి.మీ ఉందన్నారు. ఈ మధ్యలో నుంచి వెళ్లినా 80 కి.మీ. దూరం ప్రయాణించాలన్నారు. గండిపేట, గౌరెల్లి కారిడార్ చేపడితే 55 కి.మీ. ప్రయాణిస్తే గమ్యం చేరవచ్చనని వివరించారు. నార్సింగి, బాపూఘాట్, చార్మినార్, చాదర్ ఘాట్, నాగోల్ వద్ద జంక్షన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జంక్షన్‌లో ట్రంపెట్ల ద్వారా ఓఆర్ఆర్ నుంచి సిటీలోకి వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. రూ.450 కోట్లతో రెండేళ్లలో మీరాలం ట్యాంకు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామనిసీఎం స్పష్టం చేశారు.

ఓల్డ్ సిటీనీ ఒరిజినల్‌సిటీగా..

ఓల్డ్ సిటీనీ ఒరిజినల్ సిటీగా ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామని ఘంటాపదంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. గౌలిగూడ వద్ద వదిలేసిన మెట్రోను చాంద్రాయణగుట్ట వరకు పొడిగిస్తున్నామని తెలిపారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్గా మారారని విమర్శిస్తున్నారని, రియల్‌ఎస్టేట్‌అభివృద్ధి చేసి వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రియల్ ఎస్టేట్ విస్తరిస్తే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వాతంట అవే వస్తాయన్నారు.

గ్రేటర్‌ఎమ్మెల్యేలకు సీఎం బంపర్ ఆఫర్..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నామని మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మూసీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

మొదటిపేజీ తరువాయి

సేలబుల్ రైట్స్‌తో కూడిన 200 గజాల స్థలం, ఇల్లు ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇవన్నీ ఇచ్చారా? ఇవ్వకపోతే ఎప్పటిలోగా ఇస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేటు కట్టడాలు ఎన్ని? ఎంత భూమిని సేకరిస్తున్నారో వివరాలు వెల్లడించాలని కోరారు. మూసీకి స్వచ్ఛమైన గోదావరి జలాలు వదులుతామని ప్రభుత్వం చెబుతోందని, రెండున్నర టీఎంసీల నీటిని రిజర్వ్ చేశామని మంత్రి చెప్పారని గుర్తుచేశారు. అయితే ఆ రెండున్నర టీఎంసీల గోదావరి నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయో సమాధానం చెప్పలేదని విమర్శించారు. కాళేశ్వరంలో భాగమైన మల్లన్న సాగర్ నుంచే ఈ నీళ్లు తీసుకొస్తున్నారా? లేక గాలిలో నుంచి తెస్తున్నారా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూలగొడితే బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హరీష్ రావు స్పష్టం చేశారు. అవసరమైతే బుల్డోజర్లకు అడ్డంగా పడుకుని అయినా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఖాళీ స్థలాలు చాలా ఉన్నాయని, అక్కడ అభివృద్ధి పనులు చేయాలని, కానీ పేదల ఇళ్లను మాత్రం కూల్చవద్దని డిమాండ్ చేశారు.

మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు: హరీష్ రావు

అసెంబ్లీలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌పై మాట్లాడిన హరీష్ రావు, స్పీకర్ సభకు కస్టోడియన్ అని, అధికార పక్షమైనా ప్రతిపక్షమైనా సభ్యులందరికీ సమాన హక్కులు ఉంటాయని అన్నారు. ఆ హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని స్పష్టం చేశారు. బీఏసీ సమావేశంలో అసెంబ్లీని కనీసం ఏడు రోజుల పాటు నడపాలని అందరి సమక్షంలో నిర్ణయించామని, ఆ తర్వాత అవసరాన్ని బట్టి మళ్లీ సమావేశమై పొడిగింపుపై నిర్ణయిద్దామని అంగీకరించామని తెలిపారు. కానీ ఆశ్చర్యకరంగా ఆ నిర్ణయం బీఏసీ మినిట్స్‌లో పొందుపరచలేదని ఆరోపించారు. సభలో జరగబోయే అజెండా కాపీలను తెల్లవారుజామున 2-3 గంటలకు పంపిస్తున్నారని, సభ్యులు ఎప్పుడు చదవాలి, ఎప్పుడు సబ్జెక్ట్‌పై సిద్ధమవ్వాలని ప్రశ్నించారు. సభ ప్రారంభానికి కనీసం 24 గంటల ముందు అజెండా ఇవ్వడం ఆనవాయితీ అని, ఆ సంప్రదాయాన్ని ఉల్లంఘించడం వల్ల అర్థవంతమైన చర్చకు అవకాశం లేకుండా పోతోందని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై ప్రశ్నలు అడిగితే, సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. అడిగిన ఒక్క పాయింట్‌కైనా క్లారిటీ లేదని, పైగా మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నిరసన తెలపడం సభ్యుడి హక్కు అని, మైక్ ఆపడం ఎట్టి పరిస్థితుల్లోనూ సరికాదన్నారు. మూసీ నది కంపు కంటే ముఖ్యమంత్రి మాటల కంపు ఎక్కువగా ఉందని, సభా నాయకుడి హోదాలో ఉండి మాట్లాడుతున్న భాష అసహ్యంగా ఉందని హరీష్‌రావు తీవ్రంగా వ్యాఖ్యానించారు.

రేవంత్ జల ద్రోహానికి కేంద్రం ప్రకటించిన కమిటీలే నిదర్శనం

కేంద్ర ప్రభుత్వం నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నీటి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో తెలంగాణకై అనుభవం ఉన్న ఐఎస్ & డబ్ల్యూ ఆర్ అధికారి లేకపోవడం రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద ముప్పు అని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీష్ రావు వెల్లడించారు. "రేవంత్ రెడ్డి తీరుతో గోదావరి నల్లమల సాగర్ ప్రాజెక్ట్ లైన్ క్లియర్ అయ్యింది. ఇది తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టమే. బనకచర్ల విషయంలో మేము ఎప్పటికప్పుడు హెచ్చరించినా, ప్రభుత్వం తగిన స్పందన చూపలేదు. రేవంత్ రెడ్డి అంగీకారం లేకుండా కేంద్ర సమావేశాల్లో కూసుకుపోయాడు, సంతకం పెట్టి, తెలంగాణకు నష్టం చేయడం కొనసాగించాడు. ఈ కమిటీలో ఐఎస్‌అండ్‌డబ్ల్యూ ఆర్ అనుభవం లేని అధికారి ఉండటం కూడా రాష్ట్రానికి విపరీతంగా గుణ పరిణామాలకి దారి తీస్తుంది." అన్నారు. "ఏపీ ప్రభుత్వం డిసెంబర్ 11, 2025న టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. టెండర్ చివరి తేదీ తర్వాత డిసెంబర్ 16న సుప్రీం కోర్టుకు వెళ్లడం, రేవంత్ సర్కార్ నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం చూపించడమే. ఈ విధంగా తెలంగాణకు నష్టం, ఏపీకి మేలు జరుగుతోంది. మేము ఈ విధంగా రాష్ట్రం ప్రతిపక్షం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాము." హరీష్‌రావు వ్యాఖ్యల ప్రకారం, బనకచర్ల, నల్లమల సాగర్ ప్రాజెక్టులు తెలంగాణ నీటి వాటా క్షీణించే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు అవసరం అని స్పష్టం చేశారు.

కేసీఆర్‌ను టెర్రరిస్ట్‌తో పోల్చితే దేశద్రోహమే

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్‌ను టెర్రరిస్ట్‌తో పోల్చడంపై తన "రక్తం మరుగుతోందని" పేర్కొన్న కవిత, ముఖ్యమంత్రి తన మాట తీరు తక్షణమే మార్చుకోవాలని హెచ్చరించారు. అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ నాయకుడిని కసబ్ లాంటి ఉగ్రవాదితో పోల్చడం అత్యంత హేయమని, ఇది ముఖ్యమంత్రి స్థాయికి తగిన మాట కాదని కవిత మండిపడ్డారు. కేసీఆర్ ఉద్యమ ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, అలాంటి రాష్ట్రానికి సీఎం అయి ఉండి కేసీఆర్‌పై ఇలాంటి విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారా 12 ఏళ్లలో ఒక్క ఎకరం నీరు కూడా ఇవ్వలేదన్నది "నూటికి వెయ్యి శాతం నిజం" అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పదేళ్లు ప్రాజెక్ట్‌ను సాగదీసిందన్న సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జూరాల నుంచి శ్రీశైలం వరకు ఇన్‌టేక్ పాయింట్ ఎందుకు మార్చారో కేసీఆర్‌కే బాగా తెలుసని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే బీఆర్ఎస్‌ను దేవుడు కూడా కాపాడలేడు

"బబుల్ షూటర్‌లాంటి వాళ్లకు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవులు ఇచ్చి సమాధానాలు చెప్పిస్తే ప్రజలకు ఏమీ అర్థం కాదు. అసలు ట్రబుల్ అంతా వాళ్ల వల్లే వచ్చింది" అంటూ అధికార పార్టీలోని నేతలపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే బీఆర్ఎస్‌ను దేవుడు కూడా కాపాడలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం కేసీఆర్ తప్పకుండా అసెంబ్లీకి రావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జగన్ రాజకీయాలకు అతీతంగా నీళ్ల కోసం పోరాడుతున్నారని, కానీ తెలంగాణ నాయకుల్లో ఆ చిత్తశుద్ధి ఎందుకు లేదని నిలదీశారు. మేడిగడ్డను రెండేళ్లు ఎండబెట్టిన సీఎం ఇప్పుడు కృష్ణా నీళ్లపై మాట్లాడటం విడ్డూరమన్నారు. ఇప్పటికే 27 వేల ఎకరాల భూసేకరణ చేసినా ఒక్క కాలువ కూడా కట్టలేదని, డిప్యూటీ సీఎం వద్ద 12 వేల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ప్రతిపక్షాలను తిడుతూ కాలం గడిపితే ప్రజలు ఊరుకునేది లేదన్నారు. ఈ నెల 5న శాసనమండలిలో మాట్లాడే అవకాశం ఇస్తే, తన రాజీనామాకు గల కారణాలను ప్రజలకు వివరిస్తానని కవిత స్పష్టం చేశారు. చివరగా మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాట తీరు మార్చుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షుడు కల్వకుంట్ల కవిత శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ను కలిసి తన రాజీనామా ఆమోదంపై చర్చించారు. రాజీనామాకు కారణాలను సభలో వివరించే అవకాశం ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించి చైర్మన్ ఈ నెల 5 లేదా 6 తేదీల్లో ఏదో ఒకరోజు అవకాశం ఇస్తానని చెప్పారని కవిత తెలిపారు.



అభివృద్ధి కోసమే జీహెచ్‌ఎంసీలో విలీనం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి కోసమే ఔటర్ రింగురోడ్డు లోపలి మున్సిపాలిటీలు, గ్రామాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసినట్టు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి జనగణన చేపడుతున్న నేపథ్యంలో వెంటనే ప్రాంతాల డీమార్కేషన్ చేయాలని కేంద్రం ఆదేశించినట్టుగా పేర్కొన్నారు. తెలంగా ణ మున్సిపాలిటీల సవరణ బిల్లు, జీహెచ్‌ఎంసీ సవరణ బిల్లులపై శాసనసభలో జరిగిన చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. జీహెచ్‌ఎంసీలో విలీనమైన 27మున్సిపాలిటీల్లో పాలకమండళ్లు లేనందున ప్రజాభిప్రాయం తీసుకున్నట్టు తెలిపారు. విలీన ప్రాంతాల్లో పన్నులు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టంచేశారు. జీహెచ్‌ఎంసీని ఎన్ని కార్పొరేషన్లుగా విభజించాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, అందరి అభిప్రాయాలు సేకరించాక ప్రకటిస్తామని తెలిపారు.



పార్టీలో చేరిన నేతలను గౌరవించి అక్కున చేర్చుకోవాలి. అంతేతప్ప కాకులు, గద్దల్లా పొడవొద్దు. గ్రూపులు మంచివి కావు. అవి బువ్వ పెట్టవు. మనకు ఉన్న శక్తే తక్కువ. మళ్లీ ఇందులో గ్రూపులు అవసరమా? రాజకీయాల్లో విశాల హృదయంతో ఆలోచించాలి. శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరు.

- బీజేపీ ఎంపీ
ఈటల రాజేందర్

రాష్ట్రీయం

గూడ్స్ వాహనాలపై 7.5 శాతం లైఫ్ టాక్స్

- కొత్త వాహనాలకు రోడ్ సేఫ్టీ సెస్
- రాష్ట్రంలో నూతన వాహన టాక్స్ విధానం
- అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి పొన్నం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 2 : రవాణా శాఖలో తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ చట్టంపై శుక్రవారం శాసన సభలో చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 4 వీలర్ తేలికపాటి గూడ్స్ వాహనాలకు త్రైమాసిక టాక్స్ ఉండేదని ప్రస్తావించారు. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కి సంబంధించిన వాహనాలపై లైఫ్ టాక్స్ విధిస్తూ 7.5 శాతానికి అమలు చేశామని వివరించారు. ఇది కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీపై సెస్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ,గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్.

వాటికి రోడ్ సేఫ్టీ సెస్..

ద్విచక్ర వాహనాలకు రూ.2 వేలు, లైట్ మోటార్ వాహనాలకు రూ.5 వేలు, హెవీ వాహనాలకు రూ.10 వేలు రోడ్ సేఫ్టీ సెస్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. కొత్తగా రిజిస్టర్ అయ్యే వాహనాలకు మాత్రమే రోడ్ సేఫ్టీ సెస్ విధించినట్లు వివరించారు. ఆటోలు ,ట్రాక్టర్లకు ఇది వర్తించదని స్పష్టం చేశారు. మరణాలు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలతోనే జరుగుతున్నాయని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఇటీవల ఒక ప్రకటన చేశారని ప్రస్తావించారు. జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తాము రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని.. విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం విద్యాశాఖ, సంక్షేమ శాఖ, పలు పాఠశాలలు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. రోడ్డు భద్రతాపై విద్యార్థులకు, ప్రతి పౌరుడుకి అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. యూనిసెఫ్ సహకారంతో పలు పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తెలంగాణను రోడ్డు ప్రమాదాల రహితంగా మార్చడానికి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు

బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు

బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలకు సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం సమాధానం ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ 42 భవనాలకు స్థలాలు ఇచ్చారు కానీ దాని అభివృద్ధి చేయడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. మూడు భవనాలు పని ప్రారంభం అయి మధ్యలో ఉన్నాయి. కులాలకు సంబంధించిన ప్రతినిధులు ఆ స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతులకు పోకుండా కాపాడుకోవాలని అన్నారు. కురుమ భవనం పూర్తయిన ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ఇతర హాస్టల్ అవసరాలకు వాడాలని వారికే విబేధాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి చాంపియన్. బీసీ ప్రజా ప్రతినిధులతో శాసన సభ సమావేశాల్లోపు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం.బీసీ సబ్ ప్లాన్ పై గత సంవత్సరం ప్రారంభించాలనుకున్నాము ఆ నిధులు వాడతాం.బలహీన వర్గాల విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇటీవల జరిగిన సర్వే లో అభివృద్ధి చెందిన కుటుంబాల నివేదిక పరిశీలిస్తే ఏ కుటుంబంలో అయితే ఉన్నత చదువులు ఉన్నాయో వారే అభివృద్ధి చెందారు. బలహీన వర్గాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతామని అన్నారు.



సంక్రాంతికి రైతు భరోసా డబ్బులు

- నిధులు విడుదలకు గ్రీన్ సిగ్నల్
- రూ.9 వేల కోట్లు విడుదల

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి కానుక ఇవ్వనుంది. పండుగ సందర్భంగా రైతు భరోసా నిధులు రైతు అకౌంట్లలో జమ చేసేందుకు సిద్ధమవుతోంది. సంక్రాంతి పండక్కి ముందే నిధులు రిలీజ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. యాసంగి సాగు కోసం ఈ పెట్టుబడి సాయం అందించనుంది. యాసంగి సీజన్‌లో పంట వేసిన రైతులందరికీ త్వరలో అకౌంట్లలో డబ్బులు పడనున్నాయి. శాటిలైట్ సర్వే ఆధారంగా పంటలు వేసిన భూములను ప్రభుత్వం గుర్తిస్తోంది. ఈ నివేదిక ఆధారంగా పంట భూములకు మాత్రమే రైతు భరోసా డబ్బులు ఇవ్వనుంది. ఎకరానికి రూ.6 వేలు రైతుబంధు పథకంలో భాగంగా గతంలో ఎకరానికి రూ.5 వేలు అందించేవారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుతం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.6 వేలు ఇవ్వనున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో దాదాపు కోటిన్నర ఎకరాలకు డబ్బులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దమైంది. గత ఏడాది యాసంగిలో సుమారు 79.54 లక్షల ఎకరాల్లో పంట సాగయినట్లు అధికారులు క్షేత్రస్థాయి సర్వే ఆధారంగా గుర్తించారు. ఈ సారి అంతకంటే ఎక్కువ స్థాయిలో పంటలు సాగవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అధికారులు సాగు వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాలన్నీ త్వరలోనే వ్యవసాయశాఖకు అందనుండగా.. ఆ తర్వాత డబ్బులు రిలీజ్ చేయనున్నారు.

రూ.9 వేల కోట్లు విడుదల

ఈ యాసంగి సీజన్‌కు రైతు భరోసా పథకం అమలు చేయడానికి రూ.9 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఆర్థిక శాఖకు నిధులు విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సంక్రాంతి పెద్ద పండుగ కావడంతో ముందే రైతులకు నిధులు జమ చేస్తే రైతు ఆనందం రెట్టింపు అవుతుందని ప్రభుత్వం భావించింది. దీంతో పండుగలోపే లబ్దిదారులందరికీ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. ఇటీవల మీడియాతో మాట్లాడిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా త్వరలో రైతు భరోసా నిధులను జమ చేస్తామని, ప్రస్తుతం సర్వే పూర్తయ్యే దశకు చేరుకుందని ప్రకటించారు. దీంతో రైతు భరోసా నిధుల విడుదలకు మార్గం సుగమం అయిందని చెప్పవచ్చు

యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చించాలి

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: రాష్ట్రంలో యూరియా సంక్షోభంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. యూరియా కొరతకు నిరసనగా ప్లకార్డులు పట్టుకుని శాసనసభలో నిరసన తెలిపారు. షాపుల్లో దొరకని యూరియా యాప్‌ల్లో దొరుకుతుందా?, కాంగ్రెస్ వచ్చింది.. యూరియా కొరత వచ్చిందని ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులతో శాసన సభకు వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులతో లోనికి వెళ్లవద్దని సూచించారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగింది. నేను మాట్లాడిన తర్వాతనే మీకు సరెండర్ లీవ్‌ల డబ్బులు వచ్చాయి.. ఇప్పుడు యూరియా మీద కూడా రైతుల పక్షాన మాట్లాడితేనే యూరియా వస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణలో యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులపై సభలో వెంటనే చర్చ జరపాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానం పెట్టారు.




కేటీఆర్, హరీశ్‌ను ఉరితీసినా పర్వాలేదా?

- కవిత సమాధానం చెప్పాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్య

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: కేసీఆర్ ను ఉరితీసినా తప్పు లేదన్న దానికి రక్తం మరిగిపోయిందన్న కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేసిన ఆయన కేటీఆర్, హరీష్ రావు లను ఉరితిసినా తప్పు లేదా కవిత చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నేతలందరినీ కోట్ల రూపాయలు దోచుకున్నావ్ అని కవిత విమర్శిస్తుంది. కేసీఆర్ సభకు రోజు వస్తే బీఆర్‌ఎస్ పుంజుకుంటుంది అని కవిత అంటుంది, కవిత బీఆర్‌ఎస్ లో ఉన్నదా అనే అనుమానం ఉందంటూ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ ను తిడితే వస్తున్న కోపం హరీష్ రావు ను తిడితే కవితకు ఎందుకు రావడం లేదన్నారు. కవిత కన్ఫ్యూజన్ లో ఉంది .జనాల్ని కన్ఫ్యూజ్ చేస్తుందని వ్యాఖ్యానించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్‌ఎస్ తప్పు అని కవిత ఒప్పుకుంది సంతోషం అని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నల్లగొండ మంత్రి జిల్లాకు చేసిన అన్యాయం పై కవిత ప్రశ్నించాలని డిమాండ్ చేశారు.

ఏసీబీకి పట్టుబడిన ఎస్సై రమేష్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 2 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సబ్ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్‌ను తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సంగారెడ్డి జిల్లా కొల్లూర్ పోలీస్ స్టేషన్ లో పీడీఎస్ బియ్యం తరలింపులో లారీ యజమానిపై 508/2025 బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 318(4), ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సెక్షన్ 7 కేసు నమోదైంది. ఈ కేసులో లారీ ఓనర్ పేరు తొలగించేందుకు ఎస్ఐ రమేష్ రూ. 30 వేల లంచం డిమాండ్ చేసి డిసెంబర్ 17న రూ. 5 వేలు తీసుకున్నారు. మిగతా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా దీంతో లారీ యజమాని ఏసీబీ ని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు శుక్రవారం లారీ ఓనర్ కొల్లూరు పోలీస్ స్టేషన్ లో రూ.20 వేల లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. ఇప్పటికే అనేక ఆరోపణలతో ఎస్ఐ రమేష్ బదిలీ లిస్ట్ లో ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా లంచం డిమాండ్ చేసి ఏసీబీ కి చిక్కడం డిపార్ట్‌మెంట్ లో తీవ్ర చర్చకు దారితీసింది. రమేష్ కు సంబంధించిన ఆస్తుల వివరాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి అక్రమ లాభం పొందినట్లు నిర్ధారణ కావడంతో నిందిత ఎస్ఐని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని 2వ అదనపు ప్రత్యేక న్యాయస్థానం (ఎస్పీఈ & ఏసీబీ కేసులు) ముందు హాజరుపర్చనున్నట్లు ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు స్పష్టం చేశారు.



అమ్డాపూర్ వార్డు సభ్యునిగా రామ్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 2 : మండల పరిధిలోని అమ్డాపూర్ 4వ వార్డు సభ్యులుగా ఎన్నికైనా సామ రామ్మోహన్ రెడ్డి 4వ వార్డు సభ్యునిగా ఎన్నికైయ్యారు. శుక్రవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మధ్యపాగ కృష్ణ సమక్షంలో 4వ వార్డు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా సామ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాప్రతినిధుగా అవకాశం కల్పించిన ప్రజలకు గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శేఖర్, రవిందర్ రెడ్డి, ప్రవీణ్, స్వప్న కుమారి, శ్రావణి, ప్రవళిక, మధ్యపాగ శ్రీనివాస్, పోచమ్మ, మాజీ సర్పంచ్ గోపి కృష్ణారెడ్డి, జగన్ రెడ్డి, రాంరెడ్డి, సత్యలింగంగౌడ్, సైపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితను కలిసిన రంగారెడ్డి నేతలు

ప్రతిపక్షం, చేవేళ్ల, జనవరి 2: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి కామా రెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్ గౌడ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డిలునూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరం లోని జాగృతి ప్రదాన కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబురావు చీమల రమేశ్ చదలవాడ విష్ణుమూర్తి కప్పాటి పాండురంగారెడ్డి తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ రంగారెడ్డి, కామారెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి,ఎదురు గట్ల సంపత్ గౌడ్, రామిడి వెంకట్ రెడ్డి సంస్థ మాజీ చైర్మన్ జాగృతి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పారిశ్రామిక వాడ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను యధావిధిగా కొనసాగించాలి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 2 : పారిశ్రామిక వాడ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను యధావిధిగా కొనసాగించాలని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఇవాళ డిజిపీ శివధర్ రెడ్డి ను కలిసి వినతి పత్రం అందించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతం దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో మినీఇండియా జనాభాకు నిలయంగా ఉందన్నారు. ప్రస్తుతం పారిశ్రామిక వాడ బొల్లారం పోలీస్ స్టేషన్ సంగారెడ్డి జిల్లా పోలీస్ పరిధిలో ఉందని, ఈ పీ ఎస్ పరిధిని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ కింద విలీనం చేస్తే.. చాలా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ పీఎస్‌ను విలీనం చేయకుండా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక వాడ బొల్లారం అనేది అనేక పెద్దస్థాయి పరిశ్రమలు మరియు తయారీ యూనిట్లు ఉన్న ప్రధాన పారిశ్రామిక కేంద్రమన్నారు. ఇందువల్ల ప్రత్యేకమైన పోలీసింగ్ అవసరం ఉంటుందన్నారు.ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని వెంటనే ఐడిఏ బొల్లారం పీ.ఎస్‌ను సైబరాబాద్ కమిషనరేట్ లో విలీనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లారం బీజేపీ అధ్యక్షులు కొత్వాల్ ఆనంద కృష్ణ రెడ్డి, నాయకులు భరత్ చారి, తదితరులు ఉన్నారు.

శబ్దం నుంచి నిశ్శబ్దం వరకు..

- వినూత్న కార్యశాలకు వేదిక కానున్న గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ
- పరిశ్రమ సంసిద్ధతపై విద్యార్థులకు అవగాహన

GITAM
DEEMED TO BE UNIVERSITY

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 02 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సంసిద్ధం చేసే లక్ష్యంతో, 'శబ్దం నుంచి నిశ్శబ్దం వరకు - విజయం నుంచి ఆత్మపరిశీలన వైపు ఒక ప్రయాణం' పేరిట ఈనెల 9న ఒకరోజు కార్యశాలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కార్యశాల సమన్వయకర్త డాక్టర్ శ్రీకాంత్ గటాడి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రిన్స్ టన్ క్రోమాటోగ్రఫీ ఇంక్, స్వాస్థ్యహబ్ లతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యశాలలో టారో హీలర్, సంఖ్యాశాస్త్ర నిపుణురాలు, జీవిత లక్ష్యం, మనస్తత్వ కోచ్, ఎనర్జీ వెల్నెస్ మెంటార్ లిప్పీ భల్లాతో పాటు ప్రిన్స్ టన్ క్రోమాటోగ్రఫీ ఇంక్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్ కొట్టాక్కి ప్రధాన వక్తలుగా పాల్గొంటారని తెలియజేశారు. కీలకమైన కార్యకలాపాలైన భావోద్వేగ భారాన్ని గుర్తించడం, శ్వాస ద్వారా దృష్టిని నియంత్రించడం, వ్యక్తిగత శక్తి నమూనాలను అర్థం చేసుకోవడం, ప్రతిచర్య నుంచి బుద్ధిపూర్వక ప్రతిస్పందనలకు మారడానికి విద్యార్థులకు వీలు కల్పించనున్నారు. ఫార్మా ఫ్రేమ్ వర్కును సాధన, సంపూర్ణ ఆరోగ్యం, చర్య, పునరావృత సాధన, శ్వాస మీద ధ్యాస, లక్ష్యానికి అనుగుణంగా పనిచేయడం వంటివన్నీ వివరిస్తారని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులంతా, ఏకాగ్రతను పెంపొందించడానికి, పరధ్యానాలను నియంత్రించడానికి, నిర్ణయాలపై శక్తి ప్రభావాలను గుర్తించడానికి, తార్కిక తార్కికతను స్వీయఅవగాహనతో అనుసంధానించడానికి తగిన నైపుణ్యాలను పొందనున్నట్టు ఆయన వెల్లడించారు.





వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయం లో అఖండ భజన

- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జయా గుణ చైతన్య రెడ్డి ప్రత్యేక పూజలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 2 : సంగారెడ్డి పట్టణం లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం లో నూతన సంవత్సరం సందర్భంగా అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. వాసవి ఆలయ కమిటీ చైర్మెన్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమం లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జయా గుణ చైతన్య రెడ్డి దంపతుల తో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లో నిర్మల జగ్గారెడ్డి, గుణ చైతన్య రెడ్డి లను సత్కరించారు. కరణ్ గజేంద్ర స్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. వాసవి మాతా ఆలయానికి భూమిని ఇచ్చిన దాతలతో వివరాలతో కూడిన శిలా ఫలకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. దాతలను సత్కరించారు.



జల వివాదాల పరిష్కారానికి కేంద్రం కమిటీ

- వెల్లడించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి2: తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య నదీ జలాల వినియోగానికి సంబంధించిన వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జల్ శక్తి మంత్రిత్వ శాఖ ప్రత్యేక కమిటీని నోటిఫై చేసినట్లు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. కృష్ణా-గోదావరి జలాలపై ఇరు రాష్ట్రాల సమస్యలను సాంకేతికంగా పరిశీలించి పరిష్కారం చూపడమే కమిటీ లక్ష్యమని వెల్లడించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ ప్రత్యేక కమిటీని నోటిఫై చేసినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ కమిటీకి సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. తెలంగాణ నుంచి నీటివనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి, ఇంజినీర్‌ఇన్‌చీఫ్ సభ్యులుగా ఉంటారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నీటివనరుల శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఇరిగేషన్ శాఖ సలహాదారు, ఇంజినీర్‌ఇన్‌చీఫ్, చీఫ్ ఇంజినీర్ ప్రాతినిధ్యం వహిస్తారు. కేంద్ర సంస్థల నుంచి కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు చీఫ్ ఇంజినీర్ సభ్యులుగా వ్యవహరించనున్నారు. సహకార ఫెడరలిజం స్ఫూర్తితో గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో నీటి సమస్యలపై చర్చలు జరిపేందుకు కేంద్రం అవసరమైన వేదికను కూడా కల్పిస్తోందన్నారు.

కృష్ణా జల వివాదంపై కేంద్ర చర్యలు

కృష్ణా నది జలాల వివాద పరిష్కారానికి 2023 అక్టోబర్ 6న కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 కు అదనపు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసినట్లు కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రెండేళ్ల గడువు 2025 ఆగస్టు 1తో ముగిసినప్పటికీ, కృష్ణా జలాల వినియోగంపై చర్చలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ట్రిబ్యునల్ గడువును మరో ఏడాది పెంచి 2026 జూలై 31 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ విధంగా జల వివాదాల పరిష్కారానికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని చాప్టర్-9, సెక్షన్-84 ప్రకారం కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించిన అంశాల పరిష్కారానికి ఏపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కౌన్సిల్‌లో కేంద్ర జల్ శక్తి మంత్రి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.



“

పీఏం మోదీకి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్షమాపణ చెప్పాలి. దేశంలో కమ్యూనిజం కనుమరుగవడానికి ఇలాంటి భాషే కారణమనిపిస్తోంది. అసెంబ్లీలో అలాంటి భాషకు స్థానంలేదు. ప్రభుత్వం, స్పీకర్ ఖండించకుండా మర్యాదని మరిచి వారి మిత్రపక్షాన్ని సమర్థించారు. మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి చెందుతుంటే.. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ రాజకీయాలు దుర్భాషల దగ్గరే ఆగిపోయాయి.

- కేంద్రమంత్రి బండి సంజయ్

ఓపెన్ వాయిస్

రసవత్తరంగా బెంగాల్ రాజకీయం

పశ్చిమ బెంగాల్ ప్రస్తుతం ఒక నిర్ణయాత్మక రాజకీయ పర్వంలో ఉంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ 2011లో లెఫ్ట్ ఫ్రంట్‌ను ఓడించినన తర్వాత తొలిసారిగా రాష్ట్ర రాజకీయ వాతావరణం కాస్త గందరగోళంగా, అస్థిరంగా ఉంది. ఒకప్పుడు మమతా బెనర్జీకి ఎదురులేదు. 15 సంవత్సరాలు అధికారంలో ఉన్న టీఎంసీ సర్కార్‌కు ప్రభుత్వం కాస్త ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇక బీజేపీ రాష్ట్రంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దాదాపు కనుమరుగైన స్థితినుంచి వామపక్షాలు కోలుకుని కాస్త తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఒకప్పుడు భావోద్వేగశక్తిగా, విప్లవాత్మకంగా భావించిన మా మాటీ మనుష్ కథనం ఆరోపణలకు కేంద్రంగా మారింది. అధికార వికేంద్రీకరణ వల్ల కొన్ని చోట్ల నియంత్రణ మరింత కఠినంగా మారింది. అయినా, బెంగాల్‌లో ప్రభుత్వ వ్యతిరేకత అంత తీవ్ర స్థాయిలో లేదు. వ్యవస్థపై అసంతృప్తి ఉన్నా, మమతా బెనర్జీని తిరస్కరించే అంతగా మారలేదు. రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా మమతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్ష్మీ భండార్, కన్యశ్రీ, స్వాస్థ్య సతి, రూపశ్రీ వంటి సంక్షేమ పథకాలు ఆమెకు వ్యక్తిగతంగా తిరిగి అధికారం అందించే గ్యారంటీగా నిలుస్తున్నాయి. బెంగాల్‌లో ఉన్న సెంటిమెంట్ ప్రభుత్వంలో మార్పును డిమాండ్ చేసే స్థాయిలో లేదు. కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో సంక్లిష్టతకు తగిన సమాధానం దొరికింది. టీఎంసీ విజయం సాధించి మహానగరంపై తన నియంత్రణ నిలుపుకుంది. పాలక పార్టీకి ప్రస్తుతానికి ముఖ్యమైన ఆధిక్యత లభించింది. కోల్‌కతా కేవలం ఓ నగరం కాదు. రాజకీయంగా బలమైన ఘనమైన అడ్డా. దానిని నిలుపుకోవడం వల్ల క్షేత్ర స్థాయిలో విమర్శలు, ఎన్నికలలో ఓటర్ల మద్దతు తగ్గుతుందన్న వాదనలో అర్థం లేదనే ప్రభుత్వ ధీమాకు బలం చేకూరింది. బీజేపీకి సంబంధించినంత వరకూ స్థానిక ఎన్నికలు ఆ పార్టీ సంస్థాగత లోపాలను బయటపెట్టాయి. వార్డు స్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం కాకపోవడం, అభ్యర్థుల ఎంపికలో లోపాల వల్ల బీజేపీ చెప్పినంత బలంగా తనను తాను నిరూపించుకోలేకపోయింది. ఆచీతూచి అడుగులు వేస్తూ తన బలాన్ని పెంచుకునే స్థితిలో ఉంది. దీనిని పునరుజ్జీవనంగా అనలేం, కానీ పూర్తిగా తోసిపుచ్చలేం. కోల్‌కతా, అనేక జిల్లాలలో లెఫ్ట్‌ఫ్రంట్ ఓట్ల షేర్ మెరుగైంది. 2026 ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభంజనం వచ్చే అవకాశం లేనందున, సంప్రదింపులే కీలకం కాగలవు. మమతా బెనర్జీ వ్యక్తిగత చరిష్మా, వ్యక్తిగతంగా ప్రజలతో మమేకమయ్యే స్వభావం, నాయకత్వం, సంక్షేమ పథకాలు ఆ పార్టీకి కొండంత బలం. బీజేపీకి కేంద్రంలో జాతీయ స్థాయిలో అధికారం వల్ల ప్రయోజనం. వామపక్షాలు, కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల పరమైన వాదన కన్నా, నైతికపరమైన భరోసా కల్పించేందుకు సిద్ధమవుతున్నాయి. బెంగాల్ ఓటర్లు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. బెంగాల్ లో రాజకీయపరమైన ప్రశ్న ఏమిటంటే, ఎవరు ఎవరిని ఓడించగలరు అని కాదు. ఎవరు విశ్వసనీయమైన పాలన అందించగలరు అన్నదే. పశ్చిమ బెంగాల్ ఈ ఎన్నికల్లో రెండు వ్యక్తిత్వాలలో దేనివైపు మొగ్గుచూపాలనే రాష్ట్రంగా కాక, సొంత రాజకీయ భవిష్యత్ కోసం చర్చిస్తున్న రాష్ట్రంగా నిలుస్తున్నది. ప్రజలలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఈ చర్చలు ఎలా ఉన్నాయంటే, 2026 తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయి. 15 ఏళ్లగా పాతుకు పోయిన సర్కార్‌ను కూల్చివేసి, కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మిస్తే, వచ్చే ఐదేళ్లు ఆ క్రమం పరిణితి చెందుతుందా, మార్పు సాధ్యమవుతుందా, కొత్త దశ పోటీకి దారితీస్తుందా అనే గురించి కూడా కావచ్చు. 2026లో ప్రజలు ఇచ్చే తీర్పు ఏ పార్టీకి అధికారాన్ని కట్టబెడుతుందని కాక, బెంగాల్ ఏ పాలనా దృక్పథాన్ని విశ్వసించేందుకు సిద్ధంగా ఉందో వెల్లడిస్తుంది.

ప్రతిపక్షం
హైదరాబాద్,
శనివారం
03.01.2026

స్త్రీ విద్య, సామాజికాభివృద్దే నిజమైన దేశాభివృద్ధి

"సామాజిక జీవనానికి స్త్రీకి ప్రాధాన్యత లేదు. బహుజన స్త్రీలకు మాత్రమే కాకుండా బ్రాహ్మణ స్త్రీలకు కూడా విద్యను నిషేధించిన పీష్వాల పాలన అంతమొందిన పద్దెనమిదో శతాబ్దంలో "అల్ప సంఖ్యాక స్త్రీలు ముఖ్యంగా శూద్ర, అతి శూద్ర స్త్రీల యొక్క జీవన స్థితిగతులను విద్యనేర్చుట ద్వారానే సాధ్యమని,స్త్రీ విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే".




గాదె వెంకన్న
9948409093

విద్యనభ్యసించిన శూద్రుడి వంశమంతా ఏడు తరాల పాటు నరకానికి పోకతప్పదని బ్రాహ్మణేతర వర్గాలపై, బ్రాహ్మణ మరియు మనువాదుల మతవిశ్వాసాలు బలవంతంగా రుద్దుతున్న కాలమది. నిరక్షరాస్యత,మూఢ నమ్మకాలు అజ్ఞానం పట్టిపీడిస్తున్న అంధకారయుగమది. బ్రాహ్మణేతరులు చదువుకోవడం పాపంగా పరిగణించే కాలంలో, స్త్రీల జీవనవిధానం దుర్భరంగా గడుస్తున్న సమయమది. స్త్రీలను కుటుంబాలకు చెందిన ఆస్తులుగా, భౌతిక మరియు లైంగిక అవసరాలకు మరియు ఆర్థిక ప్రయోజనాలకు ఒక యంత్రంగా మాత్రమే చూసే పరిస్థితులు. "సామాజిక జీవనానికి స్త్రీకి ప్రాధాన్యత లేదు. బహుజన స్త్రీలకు మాత్రమే కాకుండా బ్రాహ్మణ స్త్రీలకు కూడా విద్యను నిషేధించిన పీష్వాల పాలన అంతమొందిన పద్దెనమిదో శతాబ్దంలో "అల్ప సంఖ్యాక స్త్రీలు ముఖ్యంగా శూద్ర మరియు అతి శూద్ర స్త్రీల యొక్క జీవన స్థితిగతులను విద్యనేర్చుట ద్వారానే సాధ్యమని,స్త్రీ విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే". మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాల ప్రాంతానికి చెందిన నైగావ్ గ్రామంలో, లక్ష్మీబాయి ఖండోజీలకు జన్మించచింది. సావిత్రిబాయి, తల్లి నుండి చక్కని రూపం, తండ్రి నుండి దేహదారుఢ్యం పొందింది. ముక్కుసూటి తనం,నిజాయితీ ఆమె సొంతం. రాళ్లతో గురిచూసి కొట్టడంలో నిష్ణాతురాలు. ఒకరోజు సావిత్రిబాయి బజార్లో నిల్చుని ఉండగా క్రైస్తవ మిషనరీ వాళ్ళు ఒక పుస్తకాన్ని ఇవ్వడం చూసిన తండ్రి ఆ పుస్తకాన్ని చూసి కోపానికి రావడం జరిగింది. ఆ పుస్తకాన్ని వెంటనే పడేయాలని సూచించడం జరిగింది. అయినా తండ్రి మాటవినలేదు. సావిత్రిబాయి తొమ్మిదవయేట, పన్నెండు సంవత్సరాల వయస్సున్న జ్యోతిబాపూలేతో పెళ్లి జరిగింది. వివాహనంతరం అత్తగారింటికి వెళ్లేటప్పుడు తన ఇంటి సామాన్లతో పాటు మిషనరీ వాళ్ళిచ్చిన పుస్తకాన్ని కూడా వెంట తీసుకెళ్లడం చిన్నతనంలోనే ఆమెకున్న పట్టుదలను గురించి చెబుతుంది.

ఉపాధ్యాయ వృత్తిధర్మంగా

1848 జనవరి 1న, బుధ బుధవారపు పేట గ్రామంలో,బిడే అనే వ్యక్తి గృహంలో మొదటి బాలిక పాఠశాల ప్రారంభమైంది. ఇది మనదేశంలో మొదటి బాలిక పాఠశాల. ఈ పాఠశాలకు ముఖ్య ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పనిచేసింది. ఇలా మన దేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి చరిత్ర సృష్టించింది. మహర్షి కార్వే తొలి మహిళా విశ్వవిద్యాలయం కంటే ముందుగా బాలిక పాఠశాల నెలకొల్పిన ఘనత పూలే దంపతులకు దక్కింది. పూణేలోని పాఠశాల నెలకొల్పిన ప్రాంతంలో అగ్రవర్ణ వ్యక్తులు సావిత్రి పై అనేక కుట్రలు,కుతంత్రాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుండేది. స్త్రీలకు విద్య నేర్పించడంపై కేవలం అగ్రవర్ణ పురుషులు మాత్రమే కాక, అగ్రవర్ణ స్త్రీలు కూడా ఈ ఆందోళన కలిగించే వాళ్ళలో ఉండడం గమనార్హం. పాఠశాలకు వెళ్లివచ్చే క్రమంలో సావిత్రి పై అల్లరిమూకలు చేసే అల్లరి అంతాఇంతా కాదు. పాఠశాల ఉన్న ప్రాంతాన్ని గుండాబస్తి అని పిలిచేవారు. ఈ ప్రాంతంలోని అల్లరిమూకలు, బ్రాహ్మణాగ్రవర్ణ పెద్దల సహకారంతో రెచ్చిపోయి ప్రవర్తించేది. తీవ్ర అసభ్య పదజాలంతో దూషించడం బురదచల్లడం,రాళ్లతో కొట్టడం పేడనీళ్లు చల్లడం చేసేది. ఇంతదారుణాలు, అవహేళన చేస్తున్నా, ఓర్పు, సహనంతో బురదబట్టలతోనే పాఠశాలకు వెళ్లి తనతో పాటు అదనంగా తీసుకువచ్చిన ఒక జత దుస్తులను ధరించి మళ్ళీ ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు, బురద బట్టలను ధరించి రావడం అలవాటుగా మార్చుకుంది.అల్లరి మూకలతో "నేను నా వృత్తి ధర్మాన్ని పాటిస్తున్నాను. మిమ్మల్ని భగవంతుడు క్షమించి ఆశీర్వదించును గాక". అని దేవుణ్ణి వేడుకోవడం ఆమెకున్న సహనాన్ని తెలుపుతుంది..



క్షరకులను మేల్కొల్పడం:

వితంతువులకు శిరోముండనం చేసే కార్యక్రమం సాంఘిక దురాచారంగా ఉండేది. దీనికి వ్యతిరేకంగా శిరోముండనం చేయబోమంటూ క్షరకులను మేల్కొలిపి వారిని చైతన్యపరిచి, తిరుగుబాటు చేసేలా 1860 సం.లో క్షరకులతో సమ్మె నిర్వహించింది. మహిళల్లో చైతన్య నింపేందుకు అంటరానితనం నిర్మూలన స్త్రీల సమస్యల పరిష్కారం కోసం 1852వ సంవత్సరంలో జనవరి 14న "తిలగుండు సమారోహ్" అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఒకరికి ఒకరు సంక్రాతి శుభాకాంక్షలు తెలుపుకోవడమనేది ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం.

సత్యశోధక్ సమాజ్ కార్యకర్తగా

బ్రాహ్మణ, ఆర్యుల మత సమాజ వ్యాప్తికి ప్రత్యామ్నాయంగా, శూద్రులు మరియు అతి శూద్రుల కోసం సత్యం అనే ధర్మాన్ని కేంద్రంగా చేసుకొని "సత్యశోధక్ సమాజ్" అనే సంస్థను జ్యోతిబాపూలే ప్రారంభించారు. ఈ సంస్థ మహిళా విభాగానికి సావిత్రిబాయి నాయకత్వం వహించేది. పురోహితులు లేకుండా శుభకార్యాలు చేయడం మరియు పునర్వివాహాలు జరిపించడం లాంటి కార్యక్రమాలను ఈ సంస్థ ద్వారా చేపట్టేవారు. ఈ కార్యక్రమాలకు బ్రాహ్మణ హిందూ సమాజం నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైనా, ఏమాత్రం వెనక్కి తగ్గకుండా "అల్పసంఖ్యాక వర్గాల్లో చైతన్యం ద్వారా వారి యొక్క అభ్యున్నతికి" నిరంతరం సావిత్రి పాటుపడేది .1890లో భర్త జ్యోతిబాపూలే మరణించిన సందర్భంలో, ఆస్తి కోసం సోదరుని వరుసయ్యే వ్యక్తి అంత్యక్రియల నిర్వహణ కోసం ప్రయత్నించగా దత్తపుత్రుడు యశ్వంత్ వారిని అడ్డుకున్న సందర్భంలో, తన భర్తచితికి తానే నిప్పుపెట్టి కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టింది సావిత్రి.భర్త చనిపోయిన భార్య వితంతువుగా శిరోముండనం, గాజులు మట్టెలు తీసేవేసే ఆచారానికి స్వస్తి పలికి, గాజులు, మట్టెలు తీయకుండా శిరోముండనం కూడా చేసుకోకుండా తానే ఒక ఉదాహరణగా నిలిచింది..

అన్నదాన కేంద్రాలు, మిషనరీల ద్వారా ఆరోగ్య సేవ

1876లో మహారాష్ట్రలో భయంకరమైన కరువు ఏర్పడిన సందర్భంలో ఆహారం లేక లక్షలాదిమంది మరణించారు. కరువు సందర్భంలో కరువు నుండి గట్టెక్కించేలా ప్రభుత్వానికి టెలిగ్రామ్ మరియు ఉత్తరాల ద్వారా ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంలో సావిత్రిబాయి తోడ్పాటు మరువలేనిది. కరువు సందర్భంలో 52 అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదానం చేయడం జరిగింది. అప్పట్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఒక మహాయజ్ఞం కంటే గొప్ప కార్యక్రమంగా భావించవచ్చు. కరువు నుండి మహారాష్ట్ర తేరుకోకముందే 1896లో పూణేలో ప్లేగు వ్యాధి వ్యాపించింది. రోజుకు వేల సంఖ్యలో మరణించేది. ప్లేగు వ్యాధిగ్రస్తుల్ని, ఇళ్ల నుండి బయటకు పంపేందుకు బ్రిటీష్ సిపాయిలు రావడం జరిగింది. ప్లేగు వ్యాధి కంటే సిపాయిల బాధకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారు. ఈ సందర్భంలో ప్లేగు వ్యాధిగ్రస్తుల కోసం స్వయంగా సావిత్రిబాయి మిషనరీలను ఏర్పాటు చేసి ఎంతో సేవ చేసింది, తన దత్త పుత్రుడు యశ్వంతు ద్వారా కలిసి ప్లేగు వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తూ నిర్విరామంగా చేసిన సేవా కార్యక్రమాలు చేసింది. యశ్వంత్ డాక్టరు కావడం సేవ కార్యక్రమాలకు ఏలాంటి ఆటంకం లేకుండా జరిగేది. నిరంతర సేవ కార్యక్రమాల వల్ల చివరికి ఆమెకు ప్లేగు వ్యాధి సోకింది. క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణించి, చివరికి 1897 మార్చి 10న సావిత్రిబాయి మహాపరినిర్వాణం చెందారు. సావిత్రిబాయి గౌరవార్థం, ఆమె చేసిన సేవలకు గాని 1.1997లో సావిత్రిబాయి పేరుతో భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంపు విడుదల చేసింది భారత ప్రభుత్వం. ఒక కూతురు ఉన్న కుటుంబాలకు యూజీసీ ద్వారా సావిత్రిబాయి ఫెలోషిప్, 1949లో మహారాష్ట్రలో సావిత్రిబాయి మహిళ యూనివర్సిటీ ఏర్పాటు, మహిళా విభాగంలో అత్యుత్తమ సేవ చేసిన వారికి సావిత్రిబాయి పూలే జ్ఞాన జ్యోతి పురస్కారం. వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలకు సావిత్రిబాయ్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డ్స్, ఆగ్రో మరియు వెటర్నరీ రంగాలలో మహిళలకు సావిత్రిబాయి ఎక్స్ లెంట్ అవార్డు, సావిత్రిబాయి పేరుపై ఇవ్వడం ఆమె సేవలకు మరియు స్త్రీ విద్యపై కృషికి నిదర్శనం. మనదేశంలో ఎంతోమంది స్త్రీలచైతన్యం కోసం కృషి చేసిన సావిత్రిబాయి జన్మదినాన్ని భారతదేశం మహిళా దినోత్సవం జరుపుకోవాలని డిమాండ్ ఉన్నది.

జనవరి 3, సావిత్రిబాయి పూలే జయంతి

వ్యాసకర్త రాష్ట్ర అధ్యక్షులు.
తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం

అవినీతి కంపును వదిలించాలి!



మన్నారం నాగరాజు
9550844433

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వశాఖల్లో అవినీతి అధికారులు, ఉద్యోగులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రతి పనికీ చేయి చాచడం కొందరు అధికారులకు అలవాటుగా మారిందని బాధితులు చెప్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థలో కొందరు పెద్దలు కమీషన్లు వసూలు చేస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో అదేబాటలో అధికార యంత్రాంగం రెచ్చిపోతున్నదని మండిపడుతున్నారు. వివిధ పనుల కోసం ఆశ్రయిస్తే 'నాకేంటి?' అంటూ వేధిస్తున్నారని చెప్తున్నారు. ప్రతీ పనికి ఓ రేటు కట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో పాలన ప్రజల సంక్షేమం కోసం ఉండాలి. కానీ నేడు అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో "చేయి తడపందే ఫైలు కదలదు" అన్న మాట సాధారణ వాస్తవంగా మారింది. జనన-మరణ ధృవపత్రాలు, భూమి రికార్డులు, పింఛన్లు, అనుమతులు ఏదైనా సరే, మధ్యలో దళారులు, అవినీతి అధికారుల జోక్యం తప్పనిసరి అయిందన్న భావన ఏర్పడింది. ఈ పరిస్థితి వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా నష్టపోతున్నారు. డబ్బు ఇవ్వలేని వారు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. లంచం ఇచ్చేవారికి పనులు వేగంగా పూర్తవుతుండటంతో, న్యాయం కంటే డబ్బుకే విలువ ఉందన్న భావన బలపడుతోంది. ఇది వ్యవస్థపై నమ్మకాన్ని కూల్చేస్తోంది. అవినీతిని అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరం. డిజిటలీకరణ, టైమ్‌బౌండ్ సేవలు, ఫిర్యాదు వ్యవస్థల బలోపేతం, విజిలెన్స్ చర్యలు, అలాగే బాధ్యత వహించని అధికారులపై కఠిన శిక్షలు అమలు చేయాలి.

కీలకశాఖలు.. అవినీతి అడ్డాలు

ప్రభుత్వంలోని కీలకశాఖలు అవినీతికి అడ్డాలుగా మారాయి. ముడుపుల మురికిలో మునిగిపోతున్నాయి. అందుకు ఏసీబీ నమోదుచేసిన కేసులే ఉదాహరణ. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రెవెన్యూశాఖలో సుమారు 25 కేసులు, పంచాయతీరాజ్ శాఖలో 19 కేసులు, పోలీస్ శాఖలో 18 కేసులు, పురపాలకశాఖలో 11 కేసులను ఏసీబీ నమోదు చేసింది. హైదరాబాద్ నగరశివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నివాస ప్రాంతాలు విస్తరించడం, భవన అనుమతులు, ఎల్ఆర్ఎస్, ఓసీలు, లైసెన్సులు పొందడం వంటి అంశాల్లో అవినీతి ఎక్కువ చోటుచేసుకుంటున్నది. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో భారీగా అవినీతి అక్రమాలు జరుగుతున్నట్టు ఏసీబీ దాడుల ద్వారా తెలుస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో ఆన్‌లైన్‌లో సింగిల్ విండోలో అనుమతులు ఇచ్చేవారు. దాంతో ప్రజలు పెద్దగా అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి ఉండేది కాదు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో పర్మిషన్లకు వివిధ స్థాయిలలో అధికారుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి.



గతంలో ఏసీబీకి పట్టుబడ్డ అధికారులు.

ఓపెన్ ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్ ధ్రువపత్రం ఇచ్చేందుకు రూ.5 లక్షలు డిమాండ్ చేసి రూ.4 లక్షలు తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) మణిహారిక ఏసీబీకి చిక్కింది. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మున్సిపల్ అనుమతుల కోసం ఒక హోటల్ యాజమాన్యం నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ గా పనిచేస్తున్న విఠల్ రావు రెండు భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయడానికి రూ.8 లక్షలు డిమాండ్ చేసి, అందులో రూ.4 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీకి దొరికాడు. అంబర్‌పేటలో కాంట్రాక్టర్ బిల్లు మంజూరు కోసం జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) మనీషా రూ.15 వేల లంచం డిమాండ్ చేసి, రూ.5 వేలు లంచం తీసు కుంటూ ఏసీబీకి చిక్కింది. అవినీతి అనేది ఒక్క వ్యక్తి తప్పిదం మాత్రమే కాదు, అది వ్యవస్థల లోపం, పర్యవేక్షణల లేమి, భయరహితత, బాధ్యతారాహిత్యానికి ప్రతిబింబం. ఈ సమస్యను నిర్మూలించాలంటే ప్రభుత్వం తీసుకునే చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కఠినంగా, స్పష్టంగా, ప్రజలకు కనిపించే విధంగా అమలుకావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు పథకాల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతుంటారు. కానీ ఆ పథకాల అమలులో అవినీతి చోటుచేసుకున్నప్పుడు ఫిర్యాదు చేసే స్పష్టమైన మార్గాలు, బాధ్యులపై తీసుకున్న చర్యల వివరాలు ప్రజలకు ఎందుకు తెలియకుండా పోతున్నాయి అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రత్యేకంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పనితీరు ప్రజలకు మరింత స్పష్టంగా, పారదర్శకంగా ఉండాలి. ప్రాంతాలవారీగా ఏసీబీ కార్యాలయాల నెంబర్లు, ఫిర్యాదు చేసే విధానం, రక్షణ కల్పించే హామీలు బహిరంగంగా ప్రకటించకపోతే ప్రజలు ముందుకు రావడం సాధ్యం కాదు. ఏసీబీకి వచ్చిన ఫిర్యాదుల్లో ఎంతమందిపై చర్యలు తీసుకున్నారు, ఎంతమందికి శిక్ష పడింది అనే గణాంకాలు కూడా ప్రజల ముందుంచాలి. అప్పుడే విశ్వాసం పెరుగుతుంది. అవినీతి పోవాలంటే చట్టాలు మాత్రమే సరిపోవు; రాజకీయ సంకల్పం అత్యంత ముఖ్యం. అధికారంలో ఉన్నవారు నిజంగా అవినీతికి వ్యతిరేకంగా ఉంటే, తమ పార్టీకి చెందిన వారైనా, అధికారులైనా ఎవరినీ వదలకుండా చర్యలు తీసుకోవాలి. అప్పుడే "చట్టం అందరికీ సమానం" అన్న భావన బలపడుతుంది. కఠినమైన చట్టాలు, పారదర్శక పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే ఏసీబీ వ్యవస్థ, పాఠ్యపుస్తకాల ద్వారా విలువల బోధన - ఇవన్నీ కలిసి పనిచేస్తేనే అవినీతిరహిత సమాజం సాధ్యం. అది కల కాదు; రాజకీయ సంకల్పం, ప్రజా చైతన్యం ఉంటే సాధ్యమే.

ఏ ఉద్యోగి అయినా లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోనేయాలని అవినీతి నిరోధకశాఖ కోరుతున్నది. 9440446106 నంబర్ ద్వారా వాట్సాప్ లో, acb.telangana.gov.in ద్వారా వెబ్సైట్లో, ఇతర సోషల్ మీడియా యాప్లోనూ ఫిర్యాదు చేయవచ్చు.

(వ్యాసకర్త సామాజిక రాజకీయ విశ్లేషకులు)

త్యాగ ధ్రువతార హజ్రత్ అలీ (రజి)



ముహమ్మద్ ముజాహిద్
9640622076

"హజ్రత్ అలీ (రజి) అంటే కేవలం ఒక పేరు కాదు.. అది జ్ఞానారణ్యంలో వికసించిన ఒక అక్షర పుష్పం, ధర్మ యుద్ధంలో గర్జించిన దైవ సింహం. ఆయన హృదయం అల్లాహ్ పట్ల ఉన్న అచంచలమైన విశ్వాసానికి ఒక నిశ్శబ్ద నిలయం. ప్రవక్త ముహమ్మద్ (స) సాంగత్యం అనే పరిమళభరిత తోటలో పెరిగిన ఆయన, భౌతిక సుఖాల కన్నా ఆధ్యాత్మిక ఉన్నతినే శ్వాసించారు. లోకం అధికారం కోసం ప్రాకులాడుతుంటే, ఆయన మాత్రం ఆ అధికారాన్ని అణగారిన వర్గాల కన్నీళ్లు తుడవడానికి ఒక సాధనంగా మార్చుకున్నారు. చేతిలో 'జుల్ఫికార్' కత్తి ఉన్నా, ఆయన కళ్లలో అనాథల పట్ల కరుణా సముద్రం దాగి ఉండేది. ప్రపంచం ఆయన పాదాల చెంత దాసోహమన్నా, ఆయన మాత్రం రాత్రివేళ చీకటిలో నిరుపేదల గుమ్మాల ముందు ఆహారపు మూటలు మోస్తూ 'అజ్ఞాత సేవకుడు'గా మిగిలిపోయారు. జ్ఞానానికి ద్వారంగా, త్యాగానికి శిఖరంగా, వినయానికి నిలువుటద్దంగా వెలిగిన ఆ మహనీయుని జీవితం.. కేవలం చరిత్ర పుటల్లో చదివే కథ కాదు, అది ప్రతి మనిషి తన మనసును శుద్ధి చేసుకోవడానికి వెతుక్కునే ఒక దివ్యమైన చిరునామా.

దివ్యమైన పుట్టుక - కాబా గర్భాలయంలో వెలిగిన జ్యోతి

చరిత్ర పుటల్లో మరెవరికీ దక్కని అరుదైన గౌరవం హజ్రత్ అలీ (రజి) సొంతం. పవిత్ర కాబా గర్భాలయంలో ఆయన జన్మించడం,సత్యం వైపు ఆయన ప్రయాణానికి ఆరంభం. ఐదేళ్ల ప్రాయం నుండే ముహమ్మద్ ప్రవక్త (స) గారి పర్యవేక్షణలో పెరగడం వల్ల, ఆయన నడవడికలో ప్రవక్త గారి సుగుణాలు ప్రతిబింబించేవి. పదేళ్ల చిన్నారిగా, లోకం నిద్రపోతున్న వేళ, తన అంతరాత్మ ప్రబోధంతో ఇస్లాంను స్వీకరించి 'మొదటి యువ ముస్లిం'గా ధర్మ పరిమళాన్ని వెదజల్లారు.

2. ప్రాణాలకు తెగించిన ప్రేమానురాగం

మక్కా శత్రువుల కత్తుల మధ్య, ప్రాణం పోతుందని తెలిసినా ప్రవక్త మంచంపై ప్రశాంతంగా నిద్రించిన ఆ హిజ్రత్ రాత్రి అలీ (రజి) అచంచల విశ్వాసానికి సాక్ష్యం. అది కేవలం ధైర్యం కాదు, తన మార్గదర్శి పట్ల ఉన్న అనంతమైన ప్రేమ.

3. ఖైబర్ వీరుడు - 'అసదుల్లా' (దేవుని బెబ్బులి)

యుద్ధరంగంలో అలీ (రజి) ఒక అజేయ శక్తే కాదు, ధర్మానికి రక్షణ కవచం. బద్ర్ నుండి ఖైబర్ వరకు ఆయన కత్తి 'జుల్ఫికార్' న్యాయం కోసం గర్జించింది. ఖైబర్ కోట తలుపును అమాంతం పెకలించిన ఆయన శక్తి వెనుక శారీరక బలమే కాదు, అల్లాహ్ తో ఉన్న ఆధ్యాత్మిక అనుబంధం ఉంది.

4. జ్ఞాన నగరానికి ప్రధాన ద్వారం

'నేను జ్ఞాన నగరమైతే, అలీ దాని ద్వారం' అన్న ప్రవక్త వాక్యం అలీ (రజి) మేధస్సుకు దక్కిన గొప్ప సర్టిఫికెట్. ఆయన కేవలం చదివిన జ్ఞాని కాదు, అనుభవించిన విజ్ఞాని. ఆయన గణిత, న్యాయ శాస్త్ర ప్రావీణ్యం నేటికీ ప్రపంచానికి పాఠం. "నహ్జ్ అల్‌బలాఘా" లోని ఆయన ప్రసంగాలు హృదయాలను తాకే ఆధ్యాత్మిక మంత్రాలు.

5. అబూ తురాబ్ -
మట్టితో ముడిపడిన మహా సామ్రాజ్యం

మహా సామ్రాజ్యానికి అధిపతి అయినా, చిరిగిన బట్టలతో, మట్టిపై పడుకున్న నిరాడంబర మూర్తి ఆయన. అందుకే ఆయనకు 'అబూ తురాబ్' (మట్టి తండ్రి) అనే పేరు స్థిరపడిపోయింది. తన సొంత అన్న ఆకలి తీర్చడానికి కూడా ప్రజల సొత్తు (బైతుల్ మాల్) ముట్టుకోని ఆయన పారదర్శకత, నేటి పాలకులకు ఒక గొప్ప హెచ్చరిక.

6. వీర మరణం - దైవ సన్నిధికి పయనం

మసీదులో నమాజ్ చేస్తూ సజ్దా (ప్రణామం)లో ఉన్నప్పుడు ఒక దుర్మార్గుడి కత్తి దెబ్బకు గురైన ఆయన, రక్తం ఓడుతున్నా తనను గాయపరిచిన వ్యక్తికి ఆహారం అందించమని కోరారు. అది ఆయన కరుణకు పరాకాష్ఠ. రమజాన్ మాసంలో షహాదత్ (వీర మరణం) పొంది, తానూ కోరుకున్న అల్లాహ్ సన్నిధికి చేరుకున్నారు. హజ్రత్ అలీ (రజి) జీవితం ఒక నిరంతర ప్రవాహం. అందులో ధైర్యం ఉంది, జ్ఞానం ఉంది, అన్నింటికీ మించి అంతులేని దైవప్రేమ ఉంది. 'ప్రజలను ప్రేమించండి, ఎందుకంటే వారు మీ సోదరులు లేదా మానవత్వంలో మీతో సమానులు' అని ఆయన చెప్పిన మాటలు విశ్వమానవ సౌభాతృత్వానికి పునాదులు.

జనవరి 3 హజ్రత్ అలీ (రజి) జయంతి సందర్భంగా..

వ్యాసకర్త ఆధ్యాత్మిక రచయిత

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

హిందువుల సొమ్మును ముస్లింలకు దోచి పెడుతున్న సర్కార్

- అసెంబ్లీలో కాంగ్రెస్, మజ్లీస్ కుమ్మక్కు
- కాంగ్రెస్ సెక్యులర్ పదాన్ని మరిచిపోయింది
- బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 2: అసెంబ్లీలో కాంగ్రెస్, మజ్లీస్ కుమ్మక్కు అయ్యాయని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో గంటల తరబడి మైక్‌ను మజ్లీస్‌కు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఓవైసీ కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ పెట్టిందా అని ఎద్దేవా చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో రాకేశ్‌రెడ్డి చిట్ చాట్ చేశారు. కాంగ్రెస్ సెక్యులర్ పదాన్ని మరిచిపోయిందని విమర్శించారు. హిందూ ఎమ్మెల్యేలను విస్మరిస్తుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఈ విషయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్‌లో హిందూ ఎమ్మెల్యేలకు అవమానం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ ఎమ్మెల్యేలు ఉన్నచోట అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి. తమ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.500 కోట్లు ఇచ్చిందని ఓవైసీ అసెంబ్లీ సాక్షిగా చెప్పారని ప్రస్తావించారు. అత్యధిక పన్ను కడుతున్న హిందువుల సొమ్మును ముస్లింలకు దోచి పెడుతున్నారని ఆరోపణలు చేశారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేదని.. తోక లేదని ఎద్దేవా చేశారు. దోచుకోవడానికి అప్పుడు కాళేశ్వరం.. ఇప్పుడు మూసీని తెరమీదకు తెచ్చారని దెప్పిపొడిచారు. గ్రామీణ తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆరోపణలు చేశారు. భూముల ధరలు పెంచుకునేందుకే.. గ్రామాలను పట్టణీకరణ చేస్తోందని అన్నారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో నిజామాబాద్ జిల్లాకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాకు నష్టం చేయొద్దని హితవు పలికారు. నిజాంసాగర్ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పుణ్యకాలం గడిచిపోయిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కాంగ్రెస్ పాలన డీపీఆర్‌లకే సరిపోతుందని విమర్శించారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు పూర్తికావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో నియోజకవర్గానికి రూ. 25కోట్లు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రజలను మభ్యపెట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు పెట్టారని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి విమర్శించారు.

అవినీతి బయటపడుతుందని బీఆర్ఎస్‌వాకౌట్

బీఆర్ఎస్ అవినీతి ఎక్కడ బయట పడుతుందోనని అసెంబ్లీ నుంచి ఆ పార్టీ నేతలు వాకౌట్ చేశారని ఎద్దేవా చేశారు. చిన్న అంశంపైన భయపడి వాకౌట్ చేస్తే ఎలా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకి జాతీయ హోదా కల్పిస్తామని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలకు హరీశ్‌రావు, కవితలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. కవిత సరైన ఆధారాలతో హరీశ్‌రావుపై ఫిర్యాదు చేస్తానంటే తాను సపోర్టు చేస్తానని స్పష్టం చేశారు. మండలి చైర్మన్ తక్షణమే కవిత రాజీనామాను ఆమోదించాలని డిమాండ్ చేశారు. కవిత రాజీనామా ఆమోదించకపోవడంతో శాసన వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం పోతుందని చెప్పుకొచ్చారు. మండలి చైర్మన్‌ను తాను కలిసి కవిత రాజీనామా ఆమోదించాలని కోరుతానని పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు



గర్భిణీలకు భరోసా 102 అమ్మఒడి వాహనాలు

- పైసా ఖర్చు లేకుండా రవాణా సౌకర్యం కల్పిస్తున్నాం: జిల్లా సూపర్వైజర్ రాఘవేంద్ర

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, జనవరి 2: నారాయణపేటజిల్లా, గర్భిణులు బాలింతల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకొచ్చిన 102అమ్మఒడి పథకం ప్రజల మన్ననలు పొందుతున్నది. వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ దవాఖానలకు వెళ్లే గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడొద్దనే సదుద్దేశంతో రాష్ట్ర సర్కార్ ఈ పథకం కింద 102 వాహనాలను అందుబాటులోకి తెచ్చింది అవసరమైనవారు 102కు కాల్ చేస్తే వీలైనంత తొందరలో అక్కడికి చేరుకొని, దవాఖానలకు చేరవేస్తున్నాయి అంతేకాకుండా వైద్య పరీక్షలు, లేదా ప్రసవం అనంతరం మళ్లీ ఇంటి వద్దకు ఉచితంగా చేస్తున్నాయి మరియు చిన్న పిల్లలకు వ్యాక్సిన్ కోసం కూడా దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఉచితంగా తరలిస్తున్నారు. మారుమూల గ్రామాలకు సైతం 102 అమ్మఒడి వాహనాలు సేవలందిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో మొత్తం 50, అమ్మఒడి 102వాహనాలు ఉన్నాయి. ఇప్పటివరకు గత సంవత్సరం ఏప్రిల్ నుండి ఈ సంవత్సరం నవంబర్ వరకు జిల్లావ్యాప్తంగా 3,12,207 మంది మహిళలు వీటి సేవలను సద్వినియోగం చేసుకున్నారు. మొత్తం 1,05732 ట్రిప్పులు తిరిగాయి 102అమ్మఒడి సేవలపై జిల్లా ప్రజలుప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వాహనాలతో గర్భిణులు, బాలింతలకు వ్యయప్రయాసలు తప్పడంతోపాటు సురక్షితమైన ప్రయాణం లభిస్తున్నదని, ఆశా కార్యకర్తలు మరియు వైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, జనవరి 2: విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం జయగిరి రోడ్డు లో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(కాజీపేట)ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థినులను సైన్స్ పాఠ్యాంశానికి సంబంధించి బోర్డుపై రాయించారు. పాఠ్యాంశాలకు సంబంధించిన పలు ప్రశ్నలను విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయినులతో తరగతుల నిర్వహణ, చదువుల్లో విద్యార్థినుల ప్రగతి, పాఠ్యాంశాలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు వంద శాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థినులకు సులభంగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాల బోధన సాగాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ కిరణ్ కుమార్, ఎం జె పి ఆర్ సి ఓ రాజ్ కుమార్, ప్రిన్సిపల్ ప్రపుల్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రతిపక్షం, కొత్తగూడెం, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలకు చెందిన గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం. మైథిలి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు వచ్చే ఏడాది జనవరి 21వ తేదీ లోగా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు .ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఉచిత వసతి, భోజనం, విద్యను వివిధ సంక్షేమ గురుకుల విద్యాలయాల ద్వారా అందించనున్నట్లు తెలిపారు.2025-26విద్యా సంవత్సరంలో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న బాలబాలికలు ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. అర్హతతో పాటు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.



దేవదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 2: దేవ దేవుని ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కోరారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా దుబ్బాక పట్టణం లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎం పి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి కృపా కటాక్షముల తో జిల్లా లోనే దుబ్బాక నియోజక వర్గం మిగతా నియోజక వర్గాల తో పోటీ పడే రీతిగా ప్రజల యొక్క సుఖ సంతోషాలు , అష్ట ఐశ్వర్యాలు పెరగాలని మనస్ఫూర్తిగా భగవంతున్ని ప్రార్థిన్నానని తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెంకటేశర స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు రావడం అనేది ప్రజల్లో పెరు గుతున్న భక్తి భావనకు సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనం అన్నారు.ఆయన వెంట బి జె పి నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్రంలో విద్యలో మెదక్ జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలి

- నాణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేయాలి
- శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 2: మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలంలోని డైట్ కళాశాలలో అప్ డేషన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నూతన భవన నిర్మాణానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ,మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో 11 కోట్ల రూపాయలతో నూతన డైట్ కళాశాల భవనానికి భూమి చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లా ను విద్యలో మొదటి స్థానంలో ఉంచుతామన్నారు.చదువుకోవడం వల్లనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, చదువుకోవడం వల్ల మానవ వికాసం జరుగుతుందన్నారు. మెదక్ ఎంపీ మాధవని రఘునందన్ రావు మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో నాణ్యమైన ఉపాధ్యాయులను తయారుచేసి సమాజానికి అందించాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ఉపాధ్యాయ వృత్తి వల్ల సమాజాన్ని మార్చే శక్తి ఉంటుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి కల్లా నూతన భవన నిర్మాణం జరిగి తరగతులు మొదలు కావాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. డైట్ కళాశాల ఉపాధ్యాయలను తయారు చేసే కార్ఖానా కావాలన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి నూతన భవనాన్ని అందించే ప్రణాళికలు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి.డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాధా కిషన్, హవేలీ ఘన్పూర్ సర్పంచ్. మేకల. సాయిలు,ఉప సర్పంచ్ వడ్ల. రాజు, ఆయా శాఖల అధికారులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

ప్రతిపక్షం, మంచిర్యాల, జనవరి 2: సావిత్రిబాయి పూలే జయంతిని కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని నిరసన చేస్తూ శుక్రవారం జాతీయ బిసి సంఘ నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు చదువు రాని సమయంలో సావిత్రిబాయి పూలే మొట్టమొదటగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి మహిళలకు చదువు నేర్పడం జరిగిందన్నారు. తక్కువ కులాల మహిళలకు విద్యను నేర్పిన మొదటి గురువుగా పేర్కొన్నారు బిసి కులస్తురాలైన సావిత్రిబాయి పూలేను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నా అన్నారు. ఆమె చేసిన సేవలు కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఆమె జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు. అలాగే కేంద్ర సెక్రటేరియట్ లో ఆమె గుర్తింపు పొందే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంఘ నాయకులు పాల్గొన్నారు.



సీఎం ను కలిసిన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 2 : నిజామాబాద్ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లను కలిశారు. శుక్రవారం హైదరాబాద్ ప్రజా భవనంలో సీఎం, టీపీసీసీలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామక్రిష్ణ ప్రజా భవన్‌లో జరిగిన నీటిపారుదలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమావేశంలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 2: రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుడు నిర్మించుకుంటున్న ఇంటిని పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనుల పురోగతిని గమనించిన కలెక్టర్, లబ్ధిదారుడితో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చు, తీసుకున్న రుణ వివరాలు, దశల వారీగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల కేటాయింపు పరిస్థితి, గతంలో నివసించిన ప్రాంతం, ప్రస్తుతం చేస్తున్న పని తదితర అంశాలపై లబ్ధిదారుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం గిద్ద గ్రామంలో డ్రైనేజీ కాలువలు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు చేపడుతున్న చర్యలను ఆయన గమనించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పిచ్చి మొక్కలు, చెత్తను పూర్తిగా తొలగించాలని, గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కల తొలగింపుతో పాటు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు కలెక్టర్ వెంట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఆర్డీవో వీణ, తహసిల్దార్ ఉమలత, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యాల పరిశీలన

రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో బోర్డుపై గణితశాస్త్ర లెక్కలు వ్రాయించి, వారి విద్యా స్థాయిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థిని నీ అభినందించారు. విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో పరస్పర చర్చ జరిపి, బోధనా ప్రక్రియను గమనించారు. బోర్డుపై ప్రశ్నలు వ్రాయించి విద్యార్థులతో సమాధానాలు చెప్పిస్తూ వారి అవగాహన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా లక్ష్యంగా పెట్టుకుని చదవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారి లోపాలను గుర్తించి తగిన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికి తీసే విధంగా బోధన సాగించాలని, పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే స్కూల్ ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.



కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

- టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఏడుగురు వార్డు సభ్యులు కాంగ్రెస్ లో చేరిక

ప్రతిపక్షం, కొమురవెల్లి, జనవరి 2: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొమురవెల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి జన్మదినం సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం గౌరాయపల్లిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ తన స్వార్థ ఆలోచలతో గ్రామాన్ని అభివృద్ధి వైపు తీసుకుపోయే ఆలోచనలతో కాకుండా తన సొంత ఎజెండా కోసం చేస్తున్న చర్యలకు, ప్రవర్తనకు నిరసనగా గౌరయపల్లిలో స్థానిక ఎన్నికలలో గెలిచిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఏడుగురు వార్డు సభ్యులు బొచ్చు రజిత, బొచ్చు సంతోష్, సంపత్ యాదవ్, దొంతర బోయిన బాబు, మాచర్ల యాదగిరి, తాడూరి బాబు, దొంతరబోయిన సౌందర్య, చంచల రాజవ్వ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మండల పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, గ్రామ అభివృద్ధి కోసం అధికార పార్టీలో చేరడం జరిగిందన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకుపోవడానికి తమ వంతు కృషి చేస్తామని, గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు శాయశక్తుల కృషిచేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ బొచ్చు ఎల్లయ్య గ్రామ యూత్ అధ్యక్షుడు మాట్ల మురళి గ్రామ కాంగ్రెస్ నాయకులు బొచ్చు కనకయ్య ఎం డి రేష్మ వాలాద్రి అంజిరెడ్డి యూత్ నాయకులు రాకేష్ గౌడ్, సాయికృష్ణ, శ్రీకాంత్,స్వామి నవీన్ T శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

22 లక్షల పాసుపుస్తకాల పంపిణీతో ప్రతి ఇంట్లో సంతోషం నెలకొంది. గత పాలకులు తమ ఫొటోలతో పాసుపుస్తకాలు పంపిణీ చేసి రూ. 22 కోట్లు తగలేశారు. రీసర్వేతో వివాదాలు పెంచారు. మేం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో మేలు చేశాం. లక్ష్యం నెరవేరేలా మంత్రులు చొరవ చూపాలి.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వెంటనే పూర్తి చేయాలి

- మంత్రి ఉత్తమ్ కు హరీష్ రావు లేఖ



ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 2: సిద్దిపేట జిల్లాలో మల్లన్న సాగర్ ద్వారా మూడు నియోజకవర్గాలకు సాగు నీరు అందించే ఇర్కోడ్ లిఫ్ట్ పథకం పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ రాశారు. సిద్దిపేట , దుబ్బాక నియోజకవర్గాల్లోని బీడు భూములను సస్యశామలం చేయాలనే లక్ష్యంతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను నిర్మించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ రిజర్వాయర్ ద్వారా 2020 సంవత్సరం నుంచి కొత్త ఆయకట్టు సృష్టించుకున్నప్పటికీ, రిజర్వాయర్ మట్టానికి ఎత్తులో ఉన్న సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లోని 17,377 ఎకరాల భూములకు ఇప్పటికీ సాగు నీరు అందడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇర్కోడ్ లిఫ్ట్ పనులు ప్రారంభించామని, 2023 నాటికి 95 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం కేవలం 5 శాతం పంప్ హౌస్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. ఇర్కోడ్ లిఫ్ట్ పనులు పూర్తయితే సిద్దిపేట నియోజకవర్గంలోని 6 గ్రామాల్లో 4,244 ఎకరాలు, దుబ్బాక నియోజకవర్గంలోని 13 గ్రామాల్లో 11,607 ఎకరాలు, గజ్వేల్ నియోజకవర్గంలోని 2 గ్రామాల్లో 1,526 ఎకరాలు మొత్తం 21 గ్రామాల్లో 17,377 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుందని తెలిపారు. దీని ద్వారా దాదాపు 10 వేల మంది రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఇర్కోడ్ లిఫ్ట్ పూర్తయితే బీడు భూములు పచ్చదనాన్ని సంతరించుకుంటాయని, 'తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు' అనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. కావున రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇర్కోడ్ లిఫ్ట్ మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఇసుక దళారులకు ప్రభుత్వం చెక్

- ప్రజలకు తక్కువ ధరకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావడానికి సాండ్ బజార్ ఏర్పాటు
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 2: అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం, సరసమైన ధరలకు ఇసుక అందించడం, మరియు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి సాండ్ బజార్ ప్రారంభించడం జరిగిందని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో మెదక్ నియోజకవర్గానికి సంబంధించిన సాండ్ బజార్ ను మెదక్ మార్కెట్ కమిటీ నందు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో కలిసి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. మెదక్ సాండ్ బజార్ ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరం అయ్యే ఇసుక సమస్య తీరినట్లేనన్నారు. టన్ను ఇసుక 12వందలు చెల్లించాలని, ఇసుక కావాల్సిన వారు 155242కి టోల్ ఫ్రీ నెంబర్ కి సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. అతి త్వరలో కమర్షియల్ ప్రైవేటు గవర్నమెంట్ పనులకు ఇసుక తీసుకోవచ్చు అన్నారు.ఇసుక అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మండ్ల కోసం ఈ సాండ్ బజార్లో 1100 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కోసం టన్ను ధర రూ.1200/ చొప్పున నాలుగు టన్నులు ట్రాక్టర్లకు ఇస్తామన్నారు. ఇసుక అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెట్రిక్ టన్ను1600 రూపాయలతో ప్రభుత్వ పనుల కోసం వెబ్సైట్లో అందుబాటులోకి తెస్తామన్నారు. లబ్ధిదారులు బ్లాకులో 2000 రూపాయలు కొంటున్న ఇసుక సాండ్ బజార్లో కేవలం1200 రూపాయలకు మెట్రిక్ టన్ను దొరుకుతుందన్నారు.ప్రతి ఒక్కరూ టీజీ సాండ్ వెబ్సైట్లో బుక్ చేసుకోవాలన్నారు.లక్ష రూపాయలు చేసే ఇసుక కేవలం 50 వేల రూపాయలకే సాండ్ బజార్లో దొరుకుతుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, ఏ.డి మైన్స్ సంజయ్ కుమార్, పిడి హౌసింగ్ మాణిక్యం తాసిల్దార్ లక్ష్మణ బాబు, మైనింగ్ ప్రాజెక్టు ఆఫీసర్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి. అశోక్,కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షులు యం. గంగాధర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ లు లక్ష్మీనారాయణ గౌడ్, లింగం, నాయకులు ముత్యం గౌడ్, మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.



పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 2: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని తొలగించి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ అధికారిక మాస పత్రిక ఉపాధ్యాయ దర్శిని రాష్ట్ర సంపాదక వర్గ సభ్యుడు ఎస్. కనకయ్య డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ నంగునూరు మండల అధ్యక్షుడు పొన్నమల్ల హరికృష్ణ అధ్యక్షతన నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డితో కలిసి శుక్రవారం టీపీటీఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ దర్శిని రాష్ట్ర సంపాదక వర్గ సభ్యుడు ఎస్.కనకయ్య మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలపై ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపును కల్పించాలని కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ సీసీఎల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు జిల్లా కార్యదర్శి ఎ.సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్ కె.రవి, అశోక్, త్రివిక్రమశర్మ, గఫూర్, సత్యనారాయణ, ప్రభాకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, గణేష్ , మంగ, రఫీక్, సీఆర్పీ రేణుక పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రతిపక్షం, తొగుట, జనవరి 2: తొగుట మండలంలోని వెంకట్రావు పేట గ్రామానికి చెందిన బండకాడి సత్తవ్వ నిన్న రాత్రి మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంది రాజు వారి కుటుంబాన్ని పరామర్శించి 2500 ఆర్థిక సహాయం అందించారు.కార్యక్రమంలో నాయకులు పాత్కుల వెంకటేశం,బెజ్జనమైన అనిల్, బెజ్జనమైన రాములు, పోతరాజు రవీందర్, కల్లేపు భాను,గడ్డమీది బాలయ్య, బెజ్జనమైన ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు...



ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్ల అందజేత

ప్రతిపక్షం, అక్బరుపేట భూంపల్లి, జనవరి 2: భూంపల్లి గ్రామంలో శ్రమదానం, వాహనదారులకు భద్రత సూచనలు, గ్రామ స్వచ్ఛతపై ప్రజలకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన కల్పించడం అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. భూంపల్లి గ్రామంలో గత వారం రోజుల నుండి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యాంప్ నిర్వహించారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల లకు సర్టిఫికెట్లను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అందజేశారు.



లింగుపల్లి సర్పంచ్, పాలకవర్గాన్ని సన్మానించిన డీబీఎఫ్

ప్రతిపక్షం, మిడిదొడ్డి, జనవరి 2: నూతనంగా ఎన్నికైన లింగుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కె.రమేష్, ఉప సర్పంచ్ బాలకిచన్, వార్డు సభ్యులను దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఘనంగా సన్మానించింది.శుక్రవారం నాడు లింగుపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద సర్పంచ్, ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులను డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్రామ పణమచాయతి పాలక వర్గం గ్రామ అభివృద్ధి కొసం అంకిత బావంతో పని చేయాలన్నారు.మద్యం,వివిధ అ సాంఘిక కార్యకలాపాలు గ్రామంలో జరగకుండా చర్యలు తీసుకొవాలని సూచించారు. ప్రజల మన్ననలు పొందినప్పుడే గెలుపుకు సార్ధకత వస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి,వివిధ సంఘాల నాయకులు జాఫర్ బాయి,సతిష్,రాంచంద్రం,యాదగిరి,గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు సినియర్ జర్నలిస్టు కె.మహేష్,పి.కిరణ్,బిక్షపతి, కె.రాజయ్య,సిహెచ్ శంకర్,వార్డు సభ్యులు కిషన్,అమర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పూర్తి నష్ట పరిహారం ఇచ్చేవరకు

మున్సిపాలిటీలో కలపొద్దు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 2: ఆర్ఎస్ఆర్ కాలనీల నివాసముంటున్నటువంటి పల్లెపహడు వేములగటు, సింగారం ఎర్రవల్లి, ఏటిగడ్డ కిష్టాపూరు, గ్రామాలను ప్యాకేజీలు ఇచ్చేంతవరకుమున్సిపల్ లో విలీనం చేయవద్దని సీపీఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం కార్యదర్శి శివలింగ కృష్ణ అన్నారు. ప్రాజెక్టు నుండి ఖాళీ చేయించి సుమారు నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఇల్లు రిజిస్ట్రేషన్ కాకపోవడం, ప్యాకేజీలు పూర్తిస్థాయిలో రాకపోవడం, భూనిర్వాసులకు పూర్తి న్యాయం చేయకముందే మున్సిపాలిటీలో కలపడంవిడ్డూరంగా ఉందన్నారు. దీన్ని ఇట్టి విషయంపై భూ నిర్వాసుల నిర్ణయం తీసుకోకుండా అధికారులు, మున్సిపల్కమిషనరు కోర్టు నుండి ఎలాంటి తీర్పు రాకముందే మున్సిపాలిటీలోలో కలపడం సరైనది కాదు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు స్వర్గం రాజేష్, రుద్రారం బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

- రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు
- ప్రతి వాహనదారుడు, ప్రతి పౌరుడి బాధ్యత
- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, జనవరి 2: ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు-2026సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ మా సోత్సవాలు జనవరి 1 నుండి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ , సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వల్ల జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి వాహనదారుడు, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ,రవాణా శాఖ అధికారులతో కలిసి నెల రోజుల పాటు రోడ్డు భద్రత నియమాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, సీఐలు సందీప్ రెడ్డి,కృష్ణమూర్తి, ఆర్ఐ శైలేందర్, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు, ఎస్సై శివానందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో అనంత సాగర్



ప్రతిపక్షం, సిద్దిపేట, జనవరి 2: కెనడాకు చెందిన గడుగ్గాయ్ అనే మాసపత్రిక సంక్రాంతి పర్వదిన సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటిలో చిన్నకోడూరు మండలం లోని అనంత సాగర్ ఉన్నత పాఠశాల కు చెందిన 7వ తరగతి విద్యార్థి బి.విశ్వ తేజ వ్రాసిన 'చందమామ రావే' అనే కథ ద్వితీయ బహుమతిగా 750 రూపాయల నగదు బహుమతి గెలుచుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి అన్నారు. 8వ తరగతి విద్యార్థిని బి.అఖిల వ్రాసిన 'అమ్మ చెప్పింది' కథ ప్రోత్సాహక బహుమతి గా 100 రూపాయలు నగదు గెలుచుకుంది. కవితల విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు ఎం.కీర్తి వ్రాసిన 'నేస్తమా', ఎన్.సంధ్య వ్రాసిన 'అమ్మప్రేమ' కవితలు కూడా ప్రోత్సాహక బహుమతులుగా 100 రూపాయల చొప్పున నగదు గెలుచుకున్నాయని చెప్పారు. విద్యార్థులను సాహిత్యం లో ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య,కోణం పర్శరాములు లను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్

అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం



ప్రతిపక్షం, సిద్ధిపేట, జనవరి 2: రాష్ట్ర వ్యాప్తంగా యువజన సంఘాలు, మహిళా సంఘాలకు రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్ అవార్డులు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువజన అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని జనవరి 23న హైదరాబాదులోని రవీంద్రభారతిలో అవార్డుల ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. 30 సంవత్సరాల లోపు వయస్సు యువజన, మహిళా సంఘాలు చేసిన సామాజిక సేవల ఆధారంగా ఈ అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల సంఘాలు తాము నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాల ఫోటోలు, ప్రెస్ క్లిప్పింగులు, మెరిట్ సర్టిఫికెట్లు, బయోడేటాతో పాటు దరఖాస్తును జనవరి 15, 2026 సాయంత్రం 5 గంటల లోపు పోస్టు ద్వారా పంపించాలని ఆయన కోరారు. వలస సుభాష్ చంద్రబోస్, వ్యవస్థాపక అధ్యక్షులు, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ, ఇంటి నెం. 292, కూరెల్ల గ్రామం, కోహెడ మండలం, సిద్ధిపేట జిల్లా - 505473. చిరునామాకు దరఖాస్తులు పంపాలని కోరారు. సామాజిక సేవారంగంలో ప్రతిభ కనబరిచిన యువజన, మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై చర్యలు

- డీఈవోను ఫోన్ ద్వారా ఆదేశించిన జిల్లా కలెక్టర్ హైమవతి



ప్రతిపక్షం, దుబ్బాక, జనవరి 2: దుబ్బాక మండలం లచ్చపేట గ్రామంలోని తెలంగాణ మెడల్ స్కూల్, జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వంట గదిలో అన్నం, వంకాయ కూర, పప్పుచారు, గుడ్లు వండినట్లుగా వంట సిబ్బంది తెలపగా అన్నింటిని తనిఖీ చేశారు. పప్పుచారు నాణ్యతగా లేదని, కూర అందరికీ సరిపోతదా అని వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన 373 మంది విద్యారులకు సరిపడినంత వండాలన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు వారీగా విద్యార్థుల హాజరు ప్రకారం స్టాక్ రిజిస్టర్ రాయకుండా మొక్కుబడిగా రాసినట్లుగా గమనించి ప్రిన్సిపల్ బుచ్చిబాబు పై మండిపడ్డారు. విద్యార్థుల పౌష్టికాహారం అందించకుండా మీకు నచ్చిన విధంగా వంట చేసి విద్యార్థులకు పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్వయంగా విద్యార్థులకు కూర వడ్డించారు. కామన్ డైట్ మెనూ పాటిస్తూ కొలత ప్రకారం ప్రతి విద్యార్థికి ఆహారం సరిపోయే విధంగా రుచికరంగా వండాలని ప్రిన్సిపాల్, వంట సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ సరిగ్గా రాయనందున, ఆహార పదార్థాలు విద్యార్థులకు సరిపడినంత వండలేదని ప్రిన్సిపల్ బుచ్చిబాబు పై చర్యలు తీసుకోవాలని డి ఈఓకు ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరంతెలంగాణ మెడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాల పక్కన గల ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కామన్ డైట్ మెనూ ప్రకారం వండలేదని వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెను ప్రకారం పెట్టకుండా ఏం చేస్తున్నావ్ అంటూ హాస్టల్ వార్డెన్ కవిత పైన మండిపడ్డారు. ఉదయం టిఫిన్ మొదలు కొని రాత్రి భోజనం వరకు ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం వండాలని మీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వసతి గృహ ప్రాంగణం మొత్తం కలియ తిరిగారు. కామన్ డైట్ మెనూ పాటించకుండా, ఆహారం నాణ్యతగా లేదని, వంట గది లోపల బయట జిడ్డు జిడ్డుగా ఉన్నందున హాస్టల్ వార్డెన్ నుండి వంట సిబ్బందిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓ కు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వసతి గృహంలోని పలు సమస్యల టాయిలెట్స్ క్లీనింగ్, గదులలో మైనర్ రిపేర్లు చేయించాలనీ పలు ఇతరత్ర విషయాలు కలెక్టర్ కి తెలపగా అన్నింటికి సానుకూలంగా స్పందించారు. ఏంఈఓ వస్తాడని మీకు కావలసిన అన్ని నమోదు చేసుకుని అన్ని సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని రామక్కపేట గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అటెండెన్స్, ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఓపికగా మెరుగని వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. రోజు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని రోగులకు సూచించారు.




పోలీసులను అడ్డం పెట్టుకొని కూటమి నేతలు దాడులు చేస్తున్నారు. వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. వీటిని బలంగా తిప్పికొడదాం. తప్పులు చేస్తున్న వారిపై చర్యలు తప్పవు. అనంతపురం(D) యల్లనూరులో పార్టీ జడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌పై హత్యాయత్నం అమానుషం.
- ఏపీ మాజీ సీఎం జగన్

దేశంలో పెరుగుతున్న వైట్ కాలర్ ఉగ్రవాదం

- రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 2: దేశంలో 'వైట్ కాలర్' ఉగ్రవాదం పెరుగుతున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అత్యంత విద్యావంతులైన కొందరు సమాజానికి, దేశానికి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో భూపాల్ నోబుల్స్ విశ్వ విద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. గతేడాది నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడును ప్రస్తావిస్తూ వైట్ కాలర్ ఉగ్రవాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. జ్ఞానంతో పాటు విలువలు, నైతికత ఎంత అవసరమో ఆ ఘటన తెలియజేస్తుందని చెప్పారు. రోగులకు ప్రిస్క్రిప్షన్‌పై 'ఆర్ఎక్స్' అని రాసే వైద్యుల చేతుల్లో 'ఆర్డీఎక్స్' ఉండటం దురదృష్టకరమని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. మరోవైపు దేశంలోని డిఫెన్స్ స్టార్టప్‌లు అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో ఆయుధాల తయారీలో భారత్ పూర్తి స్వయం సమృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'విద్య ఉద్దేశం కేవలం వృత్తిపరమైన విజయం మాత్రమే కాదు, నైతికత, నీతి, మానవ వ్యక్తిత్వ వికాసం కూడా. నవంబర్ 10న ఎర్రకోట వెలుపల బాంబు పేలుడు జరిగింది. ఈ ఘటనలో 15 మంది మరణించారు. ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారులను డాక్టర్ ఉమర్ ఉన్ నబీ నడిపాడు. ఈ కేసు దర్యాప్తులోనే వైట్ కాలర్ ఉగ్రవాద ముఠా గురించి తెలిసింది. దీని ఫలితంగా ముజమ్మిల్ గనాయ్, అదీల్ రథర్, షహీనా సయీద్ అనే ముగ్గురు వైద్యులతోపాటు, మరికొందిరిని అరెస్టు చేశారు' అని రాజ్‌నాథ్ తెలిపారు. దేశంలో ప్రస్తుతం అనేక రక్షణ రంగ స్టార్టప్‌లు అద్భుతంగా పనిచేస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. రానున్న 1520 ఏళ్లలో ఆయుధాల విషయంలో భారత్ పూర్తిగా స్వావలంబన సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.





ఇండోర్ లో నీరు కాదు.. విషాన్ని పంపిణీ చేశారు

- బీజేపీపై మండిపడ్డ రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 2: మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్‌లో కలుషిత నీరు తాగి పలువురు మృతి చెందడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి పరిపాలన కుంభకర్ణుడిలా నిద్రపోతోందని మండిపడ్డారు. ఇండౌర్ ప్రజలకు నీరు కాకుండా, విషాన్ని పంపిణీ చేస్తోందని బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటిపై గతంలో ప్రజలు పదేపదే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 'ఇండౌర్‌లో నీరు కాదు. కేవలం విషాన్ని పంపిణీ చేస్తోంది. అదే సమయంలో అక్కడి పరిపాలన కుంభకర్ణుడిలా నిద్రపోతోంది. దీంతో ఇంటింటా విషాదం అలుముకుంది. పేదలు నిస్సహాయంగా ఉండిపోయారు. దీనికి తోడు బీజేపీ నాయకుల అహంకారపూరిత ప్రకటనలు. బాధిత కుటుంబాలకు ఓదార్పు అవసరం. ప్రభుత్వం దానికి బదులుగా అహంకారాన్ని ప్రదర్శిస్తోంది. మురికిగా, దుర్వాసనతో కూడిన నీటిపై గతంలో ప్రజలు పదేపదే ఫిర్యాదు చేశారు. అయినా ఎందుకు పట్టించుకోలేదు? మురుగు నీరు తాగునీటిలో ఎలా కలిసింది? అలాంటి నీటి సరఫరాను సకాలంలో ఎందుకు నిలిపివేయలేదు? బాధ్యులైన అధికారులు, నాయకులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే ఇండౌర్‌లో జరిగిన నీటి కాలుష్యం ఘటనకు మధ్యప్రదేశ్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఇది పరిపాలన, జవాబుదారీతనంలో వైఫల్యం అని ఆరోపించారు. ఒక ప్రాంతంలో దగ్గు సిరప్‌కు సంబంధించిన మరణాలు, మరోచోట ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు చనిపోవడం, ఇప్పుడు మురుగునీరు కలిసిన తాగునీటి వల్ల మరణాలు సంభవించాయని విమర్శించారు.

సింగిడి | హైదరాబాద్ | శనివారం 03.01.2026 | 7 | ప్రతిపక్షం | Prathipaksham.in



చలికాలంలో చట్నీస్

శీతాకాలంలో మిమ్మల్ని మీరు వెచ్చగా ఉంచుకోవడానికి, మీ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ సీజన్‌లో వ్యాధుల ముప్పు కూడా పెరుగుతుంది. అందువల్ల, ఆహారంలో ఆరోగ్యకరమైన వాటిని చేర్చడం చాలా ముఖ్యం. ఈ పరిస్థితుల్లో ఆహారంలో కొన్ని ప్రత్యేకమైన చట్నీలను చేర్చడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

చలికాలంలో రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదిస్తూ మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. చట్నీలు మీ ఆహారం రుచిని పెంచడమే కాకుండా, వాటిలో ఉండే పోషకాలు వ్యాధులతో పోరాడే మీ సామర్థ్యాన్ని కూడా బలోపేతం చేస్తాయి. అందువల్ల, శీతాకాలంలో మీ ఆహారంలో కొన్ని రకాల చట్నీలను చేర్చడం వల్ల మీ ఆహారం రుచిని మెరుగుపరచడమే కాకుండా మీ ఆరోగ్యాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. శీతాకాలంలో మీ ఆహారంలో ఏ 6 రకాల చట్నీలను చేర్చుకోవచ్చో మాకు తెలియజేయండి.

ఉసిరి చట్నీ

ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుది. ఇది జలుబు, దగ్గును నివారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా, ఇది జుట్టు, చర్మం మరియు కళ్ళకు కూడా చాలా ప్రయోజనాలను అందిస్తుంది. ఉసిరి చట్నీ చేయడానికి ఉసిరికాయను కడిగి, కట్ చేసి, మసాలా దినుసులతో ఉడికించాలి. ఈ చట్నీని పెరుగు లేదా పరాటాతో తినవచ్చు.

క్యారెట్ చట్నీ

క్యారెట్‌లో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి చూపుకు చాలా మేలు చేస్తుంది. ఇది జీర్ణక్రియకు కూడా చాలా మేలు చేస్తుంది. క్యారెట్ చట్నీ చేయడానికి, క్యారెట్‌లను ఉడకబెట్టి, గ్రైండ్ చేసి, దానికి మసాలా దినుసులు వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

ముల్లంగి చట్నీ

ముల్లంగి సరైన జీర్ణ క్రియ సక్రమంగా జరగడానికి సహాయపడుతుంది. ముల్లంగి చట్నీ చేయడానికి, ముల్లంగి తురుము, దానికి కొద్దిగా నిమ్మరసం, ఉప్పు మరియు పచ్చిమిర్చి వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

వెల్లుల్లి సాస్

వెల్లుల్లిలో యాంటీఆక్సిడెంట్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి, ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. వెల్లుల్లి చట్నీ చేయడానికి, మీరు వెల్లుల్లి గ్రైండ్ చేసి, దానికి కొద్దిగా నూనె, ఉప్పు మరియు పచ్చిమిర్చి వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

పుదీనా చట్నీ


పుదీనా జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది, కడుపులో గ్యాస్‌ను తగ్గిస్తుంది. పుదీనా చట్నీ చేయడానికి, పుదీనా ఆకులను కడిగి, వాటిని గ్రైండ్ చేసి, ఉప్పు మరియు జీలకర్ర వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

చింతపండు చట్నీ

చింతపండులో విటమిన్ సి, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. చింతపండు చట్నీ చేయడానికి, చింతపండును నీటిలో నానబెట్టి, దాని గుజ్జును తీసి, దానికి బెల్లం, ఉప్పు మరియు పచ్చిమిర్చి వేసి రుచికరమైన చట్నీ చేయవచ్చు.

చట్నీ చేయడానికి కొన్ని చిట్కాలు

- చట్నీ చేయడానికి తాజా కూరగాయలను ఉపయోగించండి.
- చట్నీ ఎక్కువసేపు తాజాగా ఉండాలంటే కొద్దిగా నూనె ఉపయోగించాలి
- మీకు నచ్చిన విధంగా మీరు చట్నీకి వివిధ మసాలా దినుసులను జోడించవచ్చు
- చట్నీని పెరుగు, పరోటాలు, పకోడీలు లేదా కూరగాయలతో తినవచ్చు.











అంగారక గ్రహంపై నీటి గుహలు

- గుర్తించిన చైనా శాస్త్రవేత్తలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 2: అంగారక గ్రహంపై నీటి గుహలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. హెబ్రస్ వాలీస్ ప్రాంతంలో ఆ గుహలు ఉన్నట్లు తేల్చారు. నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా వేస్తున్నారు. భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి. మార్స్ గ్రహంపై అగ్నిపర్వతాల ద్వారా ఏర్పడిన గుహలను గతంలో గుర్తించారు. కానీ రాళ్లలోని రసాయనాల వల్ల నీటి గుహలు ఏర్పడినట్లు తాజా రిపోర్టులో తేల్చారు. ద ఆస్ట్రోఫిజికల్ జనరల్ లెటర్స్‌లో ఈ స్టడీకి చెందిన నివేదిక ఇచ్చారు. నీటి గుహల ఆవిష్కరణ మార్స్ గ్రహంపై జీవం ఉందన్న ఆధారాలను స్టడీ చేసేందుకు ఊతం ఇచ్చేలా ఉన్నది. ఎన్నో ఏళ్ల క్రితమే ఈ గుహలు ఏర్పడినట్లు తేల్చారు. భవిష్యత్తు అన్వేషణలకు ఈ గుహలను స్టడీ చేయనున్నారు. 2025 అక్టోబర్ 30న ఆ అధ్యయనానికి చెందిన డేటాను పబ్లిష్ చేశారు. నాసా శాటిలైట్ల నుంచి సేకరించిన డేటా ఆధారంగా చైనా శాస్త్రవేత్తలు రిపోర్టు ఇచ్చారు. గతంలో గుర్తించిన లావా ట్యూబ్‌లతో పోలిస్తే హెబ్రస్ వాలీస్‌లో ఉన్న నీటి గుహలు భిన్నంగా ఉన్నట్లు ఆస్ట్రోఫిజికల్ జర్నల్‌లో రాశారు.



ఖర్చుల లెక్కలడిగితే భార్యను వేధించినట్టు కాదు

- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 2: ఇచ్చిన సొమ్మును ఏవిధంగా ఖర్చు చేశావని భార్యను భర్త అడగడం క్రూరత్వం కిందికి రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీని ఆధారంగా కేసు పెట్టలేమని తెలిపింది. ఇలాంటి లెక్కలు అడుగుతున్న భర్తపై కేసు పెట్టాలంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తెలంగాణకు చెందిన ఓ జంట కుటుంబ వివాదాల కారణంగా వేరువేరుగా ఉంటోంది. పోషణ నిమిత్తం ఆయన ఆమెకు డబ్బులు పంపిస్తున్నాడు. వీటి లెక్కలు చూపించాలని అతడు కోరగా, అలా అడిగి డామినేట్ చేయడం క్రూరత్వం కిందికి వస్తుందంటూ ఆమె తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో భర్తపై కేసు పెట్టాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై భర్త సుప్రీంకోర్టుకు వెళ్లాడు.

అశ్లీల కంటెంట్ తొలగించాలి

- ఎక్స్‌కు కేంద్రం వార్నింగ్

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 2: సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసే కంటెంట్‌కు ఆయా సంస్థలే బాధ్యత వహించాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. అశ్లీల, అసభ్యకరమైన, పిల్లలపై లైంగిక వేధింపులు వంటి చట్ట విరుద్ధమైన కంటెంట్ పై చర్యలు తీసుకోవడంలో విఫలమైతే చట్టపరమైన తీవ్ర పరిణామాలు ఉంటాయని తేల్చిచెప్పారు. ఎక్స్‌లో మహిళల ఫోటోలపై నడుస్తున్న అసభ్యకర ట్రెండ్‌పై స్పందించిన కేంద్రమంత్రి, దీనిపై ఆ సంస్థే బాధ్యత వహించాలని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో జవాబుదారీతనం కోసం ఇప్పటికే స్టాండింగ్ కమిటీ కఠినమైన చట్టాన్ని సిఫార్సు చేసిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మరోవైపు ఎక్స్‌లో ప్రమాదకరమైన ట్రెండ్‌పై ఆ సంస్థకు కేంద్ర ఐటీ శాఖ నోటీసులు జారీ చేసింది. ప్రమాదకరమైన ట్రెండ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. ఐటీ చట్టం 2000, ఐటీ రూల్స్ 2021 ప్రకారం, ప్లాట్‌ఫామ్‌లు పాటించాల్సిన కనీస నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను కేంద్రం ఈ చర్యలు చేపట్టింది. అంతేకాదు చట్టవిరుద్ధంగా సృష్టించిన లేదా ప్రచారం అవుతున్న కంటెంట్‌ను ఎలాంటి ఆలస్యం లేకుండా తొలగించాలని స్పష్టం చేసింది.





ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటన రీషెడ్యూల్

భారత్, బంగ్లాదేశ్ వైట్ బాల్ సిరీస్ కొత్త తేదీలు వచ్చేశాయి. పొరుగుదేశంలో నిరుడు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడిన సిరీస్ సెప్టెంబర్ నెలలో జరునుంది. ఈ విషయాన్ని శుక్రవారం బంగ్లాదేశ్ బోర్డు అధికారికంగా వెల్లడించింది. గతేడాది ఆగస్టులో వాయిదా పడిన బంగ్లాదేశ్, టీమిండియా వైట్ బాల్ సిరీస్ తేదీలను రీషెడ్యూల్ చేశాం. సెప్టెంబర్‌లో బంగ్లా పర్యటనకు భారత జట్టు రానుంది అని బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్ షహరీర్ నఫీజ్ తెలిపాడు. కొత్త ఏడాదిని పురస్కరించుకొని శుక్రవారం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026లో అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్, న్యూజిలాండ్, భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌తో ద్వైపాక్షిక సిరీస్ తేదీలను బీసీబీ ప్రకటించింది. కొత్త షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో బంగ్లాలో వైట్ బాల్ సిరీస్ ఆడనుంది. మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం భారత బృందం ఆగస్టు 28న బంగ్లాకు వెళ్లనుంది. అనంతరం సెప్టెంబర్ 1న తొలి వన్డేతో సిరీస్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 3న రెండో వన్డే, సెప్టెంబర్ 6న మూడో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొడుతుంది. అనంతరం సెప్టెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య టీ20 సిరీస్ షురూ అవుతుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో సిరీస్ ముగుస్తుంది. నిరుడు ఆగస్టులోనే టీమిండియా వైట్ బాల్ సిరీస్ కోసం బంగ్లాదేశ్ వెళ్లాల్సింది. షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 17 నుంచి బంగ్లాదేశ్‌లో భారత్ మూడు వన్డేలు, టీ20 సిరీస్‌లో ఆడాల్సి ఉంది. కానీ, మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లతో పర్యటనను బీసీసీఐ వాయిదా వేసింది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక సిరీస్‌ను నిర్వహించాలని ఇరుదేశాల బోర్డులు భావించాయి. బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడడం.. ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో అక్కడ సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. అందుకనే కొత్త ఏడాది రెండో రోజునే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వైట్ బాల్ సిరీస్ తేదీలను ప్రకటించింది.



బంగ్లా ప్లేయర్లను 'ఐపీఎల్'లో నిషేధించాలి

- వెల్లువెత్తుతున్న నిరసనలు
- ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచన రాలేదనన్న బీసీసీఐ

పీఎల్ 2026 త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ లీగ్‌లోకి బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. బంగ్లా ప్లేయర్లపై నిషేధం విధించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ వివాదంపై ఎట్టకేలకు బీసీసీఐ వర్గాలు స్పందించాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకు మించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి. ఐపీఎల్ 2026 మినీ వేలం డిసెంబర్ 15న అబుదాబీలో జరిగింది. ఇందులో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన బంగ్లాదేశ్ ఆటగాడిగా ముస్తాఫిజుర్ రికార్డు సృష్టించాడు. అయితే బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత వేళ.. మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. దీంతో అతడిని ఐపీఎల్ నుంచి నిషేధించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ముస్తాఫిజుర్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 60 మ్యాచ్‌ల్లో 65 వికెట్లు పడగొట్టాడు. 8.13 ఎకానమీతో సమర్థవంతమైన బౌలర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన అతడు, అనంతరం ముంబై ఇండియన్స్ (2018), రాజస్థాన్ రాయల్స్ (2021), ఢిల్లీ క్యాపిటల్స్ (2022-23), చెన్నై సూపర్‌కింగ్స్ (2024) జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోవడంతో సీఎస్కే అతడిని విడుదల చేసింది. అనంతరం ఆస్ట్రేలియా ఆటగాడు జేక్ ఫ్రేసర్ మెక్‌గర్క్‌కు గాయమవడంతో రీప్లేస్‌మెంట్‌గా మళ్లీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి వచ్చాడు.



ఉస్మాన్ ఖవాజా రిటైర్మెంట్

ఆస్ట్రేలియా క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్నాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో సిడ్నీలో జరగనున్న టెస్టు మ్యాచ్ అతనికి చివరిది కానున్నది. ఆ మ్యాచ్ తర్వాత రిటైర్మెంట్ కానున్నట్లు అతను పేర్కొన్నాడు. 2011లో ఆసీస్ టీమ్‌లోకి వచ్చాడు ఖవాజా. తన తొలి అంతర్జాతీయ మ్యాచ్‌ను సిడ్నీలోనే ఆడాడు. ఆదివారం ప్రారంభం అయ్యే సిడ్నీ టెస్టులో ఒకవేళ తుది జట్టుకు ఖవాజా ఎంపిక అయితే, అప్పుడు అతనికి అది చివరి మ్యాచ్ అవుతుంది. ఆస్ట్రేలియా జట్టు తరపు ఆడిన తొలి ముస్లిం ప్లేయర్ ఖవాజానే. గత 15 ఏళ్ల కెరీర్‌లో ఖవాజా వర్ణవివక్ష ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా తరపున ఇప్పటి వరకు 87 టెస్టులు ఆడాడు. ఉస్మాన్ ఖవాజా పుట్టింది పాకిస్థాన్‌లో. కానీ చిన్నతనంలోనే ఆస్ట్రేలియాకు వలసవెళ్లారు. పాకిస్థాన్‌కు చెందిన ముస్లింగా గర్వపడుతున్నట్లు అతను చెప్పాడు. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు తరపున ఆడేది అనుమానమే అని చెప్పారని, కానీ తాను ఆ జట్టుకు ఆడి చూపించినట్లు తెలిపాడు. చిన్నతనంలోనే ఇస్లామాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు వెళ్లాడు.



ఇంగ్లండ్ జట్టులోకి యువ బౌలర్లు


షెస్ సిరీస్‌లో ఎట్టకేలకు బోణీ కొట్టిన ఇంగ్లండ్ విజయంతో సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాకు షాకిచ్చిన బెన్ స్టోక్స్ సేన.. సిడ్నీలోనూ దూకుడే మంత్రగా ఆడనుంది. జనవరి 4న సిడ్నీలో జరుగనున్న చివరి టెస్టు కోసం ఇంగ్లండ్ కీలక మార్పులు చేసింది. ఆ దేశ క్రికెట్ బోర్డు శుక్రవారం 12 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకుంటున్న బౌలింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకుంటూ యువ స్పిన్నర్ షోయబ్ బషీర్ , మాథ్యూ పాట్స్ లకు చోటు కల్పించింది. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓటమితో యాషెస్ సిరీస్ సమర్పించుకున్న ఇంగ్లండ్ మెల్‌బోర్న్‌లో పంజా విసిరింది. కుర్ర పేసర్ జోష్ టంగ్ విజృంభణతో ఆతిథ్య జట్టును మట్టికరిపించిన బెన్ స్టోక్స్ బృందం.. సిడ్నీ టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. అయితే.. తొడకండరాల గాయంతో బాధపడుతున్న పేసర్ గస్ అట్కిన్సన్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో మాథ్యూ పాట్స్ ఎంపికయ్యాడు. మెల్‌బోర్న్ ఓటమి నుంచి తేరుకొని విజయ గర్జన చేయాలనుకుంటున్న ఆసీస్ స్టీవ్ స్మిత్ సారథిగా బరిలోకి దిగనుంది. అయితే.. నాలుగో టెస్టు స్క్వాడ్‌లో ఆ దేశ బోర్డు ఏ మార్పులు చేయలేదు



జనవరి 4న

'మన శంకర వర ప్రసాద్ గారు' ట్రైలర్ రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హైలీ యాంటిసిపేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారు', విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్, ఆకట్టుకునే ప్రచార కార్యక్రమాలతో భారీ సంచలనం సృష్టిస్తోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. 'మీసాల పిల్ల' పాట 100 మిలియన్లకు పైగా వ్యూస్ దాటగా, 'శశిరేఖ' పాట దాదాపు 40 మిలియన్ల వ్యూస్ తో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. చిరంజీవి, వెంకటేష్ నటించిన పాట 'సంక్రాంతి అదిరిపోద్ది' ఒక ఫెస్టివల్ సాంగ్ లా మారింది. 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించారు. ఈ ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయనున్నారు. ట్రైలర్ పోస్టర్‌లో చిరంజీవి తెల్లటి చొక్కా, ముదురు రంగు ప్యాంటు ధరించి, ఒక మోకాలిపై కూర్చుని, చేతిలో షాట్‌గన్ పట్టుకుని, చుట్టూ యాక్షన్‌లో ఉన్న వ్యక్తుల మధ్య కనిపించడం అదిరిపోయింది. అనిల్ రావిపూడి ఇప్పటికే ఇది హైవోల్టేజ్ మాస్ ఎలిమెంట్స్‌తో పాటు క్రైమ్ డ్రామా షేడ్స్ కలిగిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని హింట్స్ నేపథ్యంలో ట్రైలర్ కోసం ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటిస్తుండగా, కేథరీన్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పనిచేస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సమీర్ రెడ్డి విజువల్స్‌ను అందిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ రైటర్స్. మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12, 2026న థియేటర్లలోకి గ్రాండ్‌గా విడుదల కానుంది.



'ది పారడైజ్' నుంచి జడల్ గా నేచురల్ స్టార్ నాని

నేచురల్ స్టార్ నాని ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది పారడైజ్' ప్రతి అప్‌డేట్ ఈ సినిమా కోసం ఎక్సయిట్మెంట్ మరింతగా పెంచుతుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని భారీగా నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. మేకర్స్ రిలీజ్ చేసిన నాని, మోహన్ బాబు, సంపూర్ణేష్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్‌లకు అద్భుతమైన స్పందన వచ్చింది. మేకర్స్ న్యూ ఇయర్ సందర్భంగా నేచురల్ స్టార్ నాని అదిరిపోయే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో నాని జడల్ పాత్రలో పవర్ ఫుల్ గా, తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ఓ కొత్త అవతార్ లో కనిపిస్తున్నారు. స్ట్రాంగ్ ఫిజిక్, పొడవైన జడలు కట్టిన జుట్టు, రగ్గడ్ గడ్డం, మీసాలతో నాని లుక్ అదిరిపోయింది. రెడ్ టింట్ గ్లాసులు, మెటల్ చైన్స్, స్లీవ్‌లెస్ బ్లాక్ అవుట్‌ఫిట్ అతని పాత్రలోని ఇంటెన్సిటీని చూపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాలో కీలకమైన జైలు ఫైట్ సీన్‌కి సంబధించినది. ఫారిన్ ఫైటర్లతో జరిగే హైవోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్ ఇది, కథను కీలక మలుపు తిప్పే ప్రధాన ఘట్టాల్లో ఒకటిగా నిలవనుంది. దసరాతో పాత్రలను అద్భుతంగా తీర్చిదిద్దిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, ఈ సినిమాను కూడా అదే స్థాయిలో రా, రగ్డ్, రియలిస్టిక్ టోన్‌తో రూపొందిస్తున్నారని ఈ పోస్టర్ స్పష్టంగా తెలియజేస్తోంది.

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' మాస్ డ్యాన్స్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఈ చిత్రంలో రవితేజ సరసన డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. మొదటి రెండు పాటలు ఇప్పటికే అద్భుతమైన స్పందనను పొందాయి. ఇప్పుడు, మేకర్స్ మూడవ ట్రాక్ వామ్మో వాయ్యో ను వరంగల్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్ లో లాంచ్ చేశారు. భీమ్స్ సిసిరోలియో మరోసారి మాస్ ఆడియన్స్ కట్టిపడేసే సాంగ్ కంపోజ్ చేశారు. 'వామ్మో వాయ్యో' ఫుల్ జోష్‌తో సాగే ఫోక్ ట్రాక్‌గా నిలుస్తూ, వినగానే ఎనర్జీని ఇస్తుంది. లైవ్లీ ఆర్కెస్ట్రేషన్ పాటకు ప్రాణం పోస్తే, స్వాతి రెడ్డి అందించిన ప్రత్యేకమైన వాయిస్ ఈ పాటను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఆమె వాయిస్‌లో ఉన్న ఆ ప్రత్యేక టోన్ పాటకు అదిరిపోయే ఎట్రాక్షన్ ని జోడించింది. కలర్ ఫుల్ సెట్ డిజైన్ విజువల్స్‌ను మరింత రిచ్‌గా తీర్చిదిద్దుతూ, పాటలోని ఉత్సాహాన్ని తెరపై అద్భుతంగా ప్రజెంట్ చేసింది. దేవ్ పవార్ రాసిన లిరిక్స్‌లో రస్టిక్ ఫ్లేవర్‌తో పాటు పక్కా మాస్ టచ్ ఇచ్చింది. శేఖర్ VJ మాస్టర్ కొరియోగ్రఫీ అయితే హై ఎనర్జీ స్టెప్స్‌తో కిక్ ఇచ్చింది.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200